J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12





THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 13 29.8.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

**సుఖ దుఃఖాలు**

# పాలనతో ప్రతిష్ఠ.. పార్టీతో అప్రతిష్ఠ!



తెలుగుదేశం నేతల్లో క్రమశిక్షణా రాహిత్యం
వివాదాల్లో చిక్కుకుంటున్న ఎమ్మెల్యేలు, మంత్రులు
ఎన్నిసార్లు హెచ్చరించినా ఫలితం శూన్యం
చర్యలకు ఉపక్రమిస్తున్న అధిష్ఠానం
వేటు తప్పదంటూ బాబు హెచ్చరిక

విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రాన్ని పరుగులుపెట్టించే క్రమంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సానుకూల ఫలితాలని సాధిస్తోంది. ఇదే సమయంలో కొంతమంది పార్టీనేతల వ్యవహారశైలి పార్టీ ప్రతిష్ఠని దిగజారుస్తోంది. తెలుగుదేశం పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా.. బాబు తన పనితీరులో దూసుకెళ్తుంటే, అదే పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు మాత్రం వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నారు.

సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అంటూ కూటమి ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో, తమ అధిష్టానానికి పంటికింద రాయిలా, కంటిలో నలుసులా వ్యవహరిస్తూ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ప్రతిష్టను మంటగలపడమే కాకుండా, తాము కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోకుండా, తమ పరువుతో పాటు ప్రభుత్వ పరువునూ గంగపాలు జేస్తున్నారు.

దీంతో ఇన్నాళ్లూ విజ్ఞప్తులు, సూచనలు, వార్నింగ్‌లకు పరిమితమైన తెలుగుదేశం అధినేత చంద్రబాబు కనీసం కొంత మంది పైనైనా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. తద్వారా మిగతా కేడర్‌కు స్పష్టమైనా సంకేతాలు ఇవ్వాలని, పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే ఏ విషయంలోనూ ఇకపై ఉపేక్షించబోననే విషయాన్ని గట్టిగా తెలియజెప్పాలని ఆయన యోచిస్తున్నట్లు భోగట్టా. దీంతో హిట్ లిస్టులో ఉన్న ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైనట్లు సమాచారం.

## హామీల అమల్లో అధినేత దూకుడు!

ఏడాదిన్నర క్రితం 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో, తెలుగుదేశం 135 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉంది. ఇక పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో సీఎం చంద్రబాబు పార్టీకి, ముఖ్యమంత్రి హోదాలో ప్రభుత్వానికి వెన్నెముకగా వ్యహరిస్తూ, ఓ వైపు రాజధాని అమరావతి, మరోవైపు పోలవరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టడమే కాకుండా వీటితోపాటూ సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ సాయంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు 18 గంటలకు పైగా కష్టపడుతూ అన్ని వర్గాల నుంచి కితాబులందుకుంటున్నారు. ముఖ్యంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ, ఉచిత సిలిండర్లు వంటి

2లో




జననం: 01.07.1930 మరణం: 03.09.2016

## 9వ వర్ధంతి

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

**గునుపాటి ఆదిశేషారెడ్డి గారు**

పరమపదించి తేది.03.09.2025 నాటికి
తొమ్మిదేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు
**గునుపాటి మురళీకృష్ణారెడ్డి**
మరియు
**కుటుంబసభ్యులు**

## ఆవిడ సరే...

# ఆయనెందుకు ఇప్పుడు నోరు చేసుకోవడం!?

తిరుపతి ఒకప్పటి స్ట్రాంగ్ మ్యాన్ భూమన కరుణాకరరెడ్డి నాకు ఓ ఇరవై ఏళ్లుగా తెలుసు (ఆయనకు నేను తెలియదు). ఆయన ఎవరి మీదయినా నోరు పారేసుకోవడం ఇంతవరకు చూడలేదు. మాటలలో సభ్యత, వినయం తొంగి చూస్తుంటాయి. నిదానంగా, సౌమ్యంగా, విషయ ప్రధానంగా ఆయన మాటలు ఉంటాయి. ఆ విధంగా.. రాజకీయ నాయకుల్లో ఆయనో పద్ధతిగల మనిషి అనే భావన చాలామందిలో ఉంది.

అటువంటి భూమన కరుణాకరరెడ్డి, మంగళవారం నాడు ఒక సెల్ఫీవీడియోను తిరుపతిలో మీడియాకు రిలీజ్ చేశారు.

నిజానికి, వీడియోల్లో ఎంత విచ్చలవిడిగా అయినా మాట్లాడవచ్చు. ఎవరి గురించి అయినా మాట్లాడవచ్చు. ఎదురు ప్రశ్నలు వేసేవారు ఎదురుగా ఉండరు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన అగత్యం ఉండదు. చెలరేగిపోవచ్చు. అందుకే మన గౌరవ ప్రధాని మీడియాను అడ్రస్ చెయ్యరు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్ కూడా... ప్రశ్నలు అడగని అతి కొద్దిమంది విలేకరులను పిలిచి ఆయన చెప్పదలుచుకున్నది చెబుతారు.

అలాగే, కరుణాకరరెడ్డి కూడా మీడియా మీట్ పెట్టకుండా ఒక వీడియోలో చెలరేగిపోయారు. ఆ చెలరేగిపోయేది ఏదో... చంద్రబాబు నాయుడు మీదో, నారా లోకేష్ మీదో అయుంటే.. అది పెద్ద చర్చనీయాంశం అయి ఉండేది కాదు. పుణ్యం... పురుషార్థం రెండూ దక్కేవి.

తమ నాయకులైన వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సేవలో తరించి.. ఒకసారి చంచల్‌గూడా జైలు దర్శనం చేసుకుని,10 నెలల పాటు అక్కడ జీవచ్ఛవంలా తయారైన ఎర్రా శ్రీలక్ష్మి అనే ఐఏఎస్ అధికారిణిపై కరుణాకరరెడ్డి విరుచుకుపడ్డారు. అంటే... పరోక్షంగా తన నాయకులపైనే విరుచుకు పడ్డట్టుగా భావించవచ్చు.

చట్ట వ్యతిరేక, దగుల్బాజీ పనులు చేయడానికి ఆమె ఏ మాత్రం వెనుకాడదు అనడంలో సందేహం లేదు. లేకపోతే, కార్యదర్శి వంటి ఉన్నత స్థానానికి చేరుకున్న ఐఏఎస్ అధికారిణి జైలుకు వెళ్లే పనులు



ఎందుకు చేస్తుంది? మన తెలుగు రాష్ట్రాలలో జైలుకు వెళ్లిన తొలి మహిళా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి.

అయితే, ఆవిడమీద ఇంకొంత బురద ( ఇప్పటికి పడింది చాలదు అన్నట్టుగా) జల్లే ముందు, కొన్ని ప్రశ్నలకు భూమన సమాధానాలు చెప్పవలసి ఉంటుంది కదా అంటున్నారు, ఆయన వీడియో సందేశం విన్నవారు.

1. ఆమె చంచల్‌గూడా జైలుకు ఎందుకు వెళ్ళింది? కారణం ఎవరు?
2. చచ్చి, చెడి బెయిల్ తెచ్చుకున్న తరువాత... తెలంగాణ క్యాడర్ నుంచి ఆంధ్ర క్యాడర్‌కు ఆమెను పని గట్టుకుని తీసుకు వచ్చిందెవరు?
3. కార్యదర్శి నుంచి అదనపు ప్రధాన కార్యదర్శిగా – ఔట్ –ఆఫ్ –టర్న్ ప్రమోషన్ ఇచ్చిందెవరు?
4. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు ఆమెను మకుటం లేని మహారాణిని చేసిందెవరు?
5. టిడిఆర్ బాండ్ల రూపంలో ఆమె దోచుకుంటుంటే... కరుణాకరరెడ్డి అప్పటి ముఖ్యమంత్రికి చెప్పారా?
5. చెబితే, అప్పటి సీఎం వినలేదా?
6. లేక, చూసీ చూడనట్టు ఊరుకున్నారా?
7. ఈవిడ దోపిడీ జగన్‌కు తెలియలేదా?
8. శ్రీలక్ష్మి అంత విచ్చలవిడిగా దోచేస్తుంటే.. ఆ శాఖ నుంచి ఆవిడను ఎందుకు బదిలీ చేయించలేదు?
9. ఆవిడపై ఆరోపణలు చేయడానికి కరుణాకరరెడ్డికి ఇంతకాలం ఎందుకు పట్టింది?
10. తిరుపతి మున్సిపాలిటీ టీడీఆర్ బాండ్స్‌లో తనకు ఏమీ ముట్టలేదని కరుణాకరరెడ్డి చెప్పగలరా?
11. 'జగన్'ను నేరుగా విమర్శించలేక, ఆయనకు 'ఆత్మ'లాగా వ్యవహరించిన శ్రీలక్ష్మి మీద విరుచుకుపడ్డారా?
12. శ్రీలక్ష్మి అవినీతిపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరలేదు?
13. శ్రీలక్ష్మి సూత్రధారా? లేక, పాత్రధారా?

ఇలా అనేక ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన 'అబ్లిగేషన్' నుంచి కరుణాకర్‌రెడ్డి విజయవంతంగా బయటపడ్డారు.

శ్రీలక్ష్మికి ఇప్పుడు కొత్తగా పోవాల్సినవి ఏమీ లేవు. పోవాల్సినవన్నీ ఇదివరకు జైలుకు వెళ్ళినప్పుడే పోయాయి. చలికాలంలో చన్నీళ్ల పోసుకోవాలి అనుకుంటే మొదటి రెండు చెంబులకే చలిచలిగా ఉంటుంది. ఇక, తరువాత చలి..గిలి ఉండదు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అయినా ఒకటే... ఎర్రా శ్రీలక్ష్మి అయినా ఒకటే. శ్రీ లక్ష్మి 'ఇంత తినేసింది' అని ఎవరూ ఆశ్చర్యపోవడం లేదు. "భూమన కరుణాకరరెడ్డి ఇప్పుడు ఎందుకు ఇవన్నీ మాట్లాడుతున్నారు!?" అని ఆశ్చర్యపోతున్నారు.

ఆయన ఇంకో పని చేయాలి. తన దగ్గర ఉన్న ఆవిడ విగ్గులు, చీరల రహస్యాలను ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు కరుణాకరరెడ్డి అంద చేయాలి. వాళ్ళు తేల్చుతారు, ఆయన ఆరోపణల్లోని నిజానిజాలు. ఆవిడ మరోసారి జైలుకు ఒక్కర్తే వెళతారో..., లేక ఎవరినైనా వెంట బెట్టుకు వెళతారో!

**- భోగాది వేంకట రాయుడు**

# పాలనతో ప్రతిష్ఠ.. పార్టీతో అప్రతిష్ఠ!

(మొదటిపేజీ తరువాయి)

పథకాల అమలుతో ఇప్పటికే పాలనలో తనదైన మార్కు చూపిస్తూ దూసుకెళ్తున్నారు. ఇక తాజాగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రమాణం, సమాజంలోని అత్యంత పేద వర్గాలకు చేయూతనిచ్చేం దుకు పీ4 పథకాన్ని అమల్లోకి తెచ్చి తిరుగులేని విజయాలను సాధిస్తున్నారు. సంపన్న వర్గాలకు చెందిన మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహిస్తూ హామీలన్నింటినీ పూర్తిగా నెరవేర్చామంటూ సెప్టెంబర్ 6న సూపర్ సిక్స్– సూపర్ హిట్ విజయోత్సవ సభకు అనంతపురంలో ఏర్పాట్లు సైతం ప్రారం భించారు. ఇలాంటి సమయంలో పలువురు ఎమ్మెల్యేలపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడం ఆయనకు ఆగ్రహం కలిగించినట్లు సమాచారం.

### తీరుమార్చుకోని ఎమ్మెల్యేలు!

ఓ వైపు ఏడు పదుల వయస్సులోనూ తమ అధినేత పట్టువదలని విక్రమార్కుడిలా రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమిస్తుంటే, మరోవైపు అధికారం అండతో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు దారితప్పుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి ప్రొటోకాల్ పాటించలేదంటూ రాయచోటిలో పోలీసులపై అవాకులు, చవాకులు పేలారు. ఇటీవల శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ గిరిజన తెగకు చెందిన ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేయడం, వారి వాహనాలను ధ్వంసం చేయడం, ఆముదాల వలస ఎమ్మెల్యే కూనా రవికుమార్ ఓ కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు రావడం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌ను బుడ్డాపకిర్ అంటూ బూతులు తిట్టడం, వార్–2 సినిమాను ఆడనివ్వబోనంటూ వార్నింగ్ ఇవ్వడం, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఓ మహిళతో వీడియో కాల్ మాట్లాడుతూ ముద్దులు పెట్టేలా సైగలు చేయడం, గతంలో తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనను బలవంతంగా లొంగదీసుకున్నాడంటూ ఓ మహిళ హైదరాబాద్‌కు వెళ్లి మరీ ప్రెస్‌మీట్ పెట్టడం, దానిపై కేసు నమోదు కావడం, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆగస్టు15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తనకు వేదికపై కుర్చీ వేయలేదంటూ స్థానిక కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సహా అధికారులపై బహిరంగంగా చిందులు వేయడం, తాజాగా తనకు ప్రొటోకాల్ మర్యాదలు చేయలేదంటూ సీఐ, ఎస్.ఐలపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు బూతుపురాణం అందుకోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశలయ్యాయి. అలాగే రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయంలో సిఫార్సు లేఖలివ్వడం వివాదాస్పదం కావడంతో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ ప్రెస్‌మీట్ పెట్టిమరీ వివరణ ఇచ్చుకో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఇసుక తవ్వకాలు, మద్యం షాపుల కేటాయింపులో కొందరు ఎమ్మెల్యేలు బరితెగించి వ్యవహరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ సమావేశాల్లోనూ, కేబినెట్ మీటింగ్‌లలోనూ ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం చేస్తున్న మంచిని, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలందరికీ తెలియజేయాలని సీఎం చంద్రబాబు లెక్కకుమిక్కిలిసార్లు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా కొందరు ఎమ్మెల్యేలు మాత్రం విచ్చలవిడిగా వ్యవహరిస్తూ సమస్యలకు కేంద్ర బిందువు అవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### బెత్తం తీయాల్సిందేనా?

దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నింటిలో తెలుగుదేశానికి ఓ ప్రత్యేక స్థానముంది. ఓ సమయంలో ప్రాంతీయ పార్టీగా ఉంటూ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించి, అత్యంత అరుదైన ఘనతను కూడా ఆ పార్టీ సొంతం చేసుకుంది. ఇక తెలుగుదేశం అంటే క్రమశిక్షణకు మారుపేరుగా విశ్లేషకులు, విమర్శకులు సైతం భావిస్తుంటారు. ఎందుకంటే అక్కడ అంతర్గత కలహాలు టీకప్పులో తుపానులా సమసిపోతుంటాయి కాబట్టి. ఏ విషయమైనా తెగేదాకా లాగే పరిస్థితి ఉండదు కాబట్టి. అయితే గత సాంప్రదాయాలకు భిన్నంగా ఈసారి ఎక్కువ సంఖ్యలో కొత్తవారు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం, వారందరికీ అధికారం కొత్త కావడంతో తరచూ బహిరంగంగా యంత్రాంగంపై చిందులేయడమే కాకుండా, చివరికి లైంగిక వేధింపుల వరకు వెళ్లి విమర్శల పాలవుతున్నారు. అత్యుత్సాహంతో నోరు జారి సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. దీంతో ఈ వ్యవహారం మరింత దిగజారకుండా సమస్యలకు కారణమైన ఎమ్మెల్యేలను, మంత్రులను సీఎం చంద్రబాబు స్వయంగా పిలిపించుకుని వివరణ తీసుకున్నారు. తొలి తప్పుగా భావించి హెచ్చరించి పంపించారు. అయితే లెక్కకి మించి వివాదాలు పెరిగిపోతుండడంతో తప్పు చేసే ఎమ్మెల్యేలపై వేటు వేయడమే మంచిదనే అభిప్రాయానికి అధినేత వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఇకపై టీడీపీ ఎమ్మెల్యేల తప్పులను శిశుపాలుడి తరహాలో అధిష్ఠానం లెక్కిస్తుందని, అయినా తీరుమార్చుకోకుంటే తోక కత్తిరించాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలా చేయకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని ఆయన తన సన్నిహితుల వద్ద అభిప్రాయపడినట్లు సమాచారం. మంచికంటే చెడు వేగంగా వ్యాప్తి చెందుతుందనే విషయాన్ని ఎమ్మెల్యేలు గమనించకుంటే ఎలా..? అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇకనైనా అధినేత సూచనలకు అనుగుణంగా ఎమ్మెల్యేలు, నాయకులు నడుచుకుంటారో, లేకుంటే వారి రాజకీయ సమాధికి వారే మార్గం వేసుకుంటారో కాలమే నిర్ణయించనుంది.

మొత్తంమీద సుపరిపాలనతో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంటే.. నాయకుల చిల్లర వ్యవహారాలతో పార్టీ అప్రతిష్ఠ పాలవుతోందన్న ఆందోళన ఆ పార్టీవర్గాలలో వ్యక్తమవుతోంది...!

## విద్యార్థి చదువుకు విపిఆర్ సాయం



అసలే పేద కుటుంబం. తండ్రి దివ్యాంగుడు. పేదరికంతో కుటుంబ పోషణ గడపడం కష్టంగా మారిన ఆ కుటుంబానికి విపిఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళెం గ్రామానికి చెందిన పొన్నవాడ ప్రమోద్‌కుమార్ అనే విద్యార్థి చదువుకు సాయంగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల 50 వేల రూపాయలను అందజేశారు. నెల్లూరు నగరంలోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో విద్యనభ్యసించే ప్రమోద్ కుమార్‌కు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫీజు ఖర్చులకు గత సంవత్సరం కూడా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. తాజాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు, పుస్తకాలు వగైరా ఖర్చులకు గాను విపిఆర్ ఫౌండేషన్ మరో 50వేల రూపాయలను అందించడంతో, ఆ విద్యార్థి విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులకు తన కృతజ్ఞతలు తెలిపారు.





# భారతదేశం శక్తివంతంగా ఎదగాలి

## • ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

ప్రపంచ దేశాలలో భారత్ శక్తివంతమైన దేశంగా ఎదగాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ చెప్పారు. ఈనెల 28న ఆయన తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మికత ఒక్కటే ఉన్నతమైన మానవ జీవన విధానమన్నారు. ఆధ్యాత్మికం వలన స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ సిద్ధిస్తుందని తెలిపారు. శ్రీవారి అనుగ్రహంతో దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. తొలుత ఆయన్ను తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ బిఆర్ నాయుడు ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన తిరుపతిలోని కంచి మఠాన్ని సందర్శించారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహం పొంది ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరిగి బయలుదేరి వెళ్ళారు. రాష్ట్ర పురపాలక మంత్రి పి.నారాయణ, కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తొలుత ఆయన తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయానికి రాగానే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయన్ను ఆత్మీయంగా పలకరించి స్వాగతించారు.

# గణపయ్య సేవలో.. నారాయణ



వినాయకచవితి సందర్భంగా ఈనెల 27న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరులో ఏర్పాటుచేసిన పలు వినాయక మండపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి నారాయణ కుటుంబ సభ్యులకు వినాయక మండపాల నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు.. విఘ్నేశ్వరుని దర్శించుకొన్న మంత్రి, స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత నగరంలోని ములుముడి బస్టాండ్ సెంటర్లో శ్రీ గణేష్ మరాఠీ మిత్ర మండలి ఏర్పాటు చేసిన వినాయకుడి మండపాన్ని దర్శించుకున్నారు.. అనంతరం రాజస్థానీ గణేష్ యువ మిత్ర మండలి ఏర్పాటు చేసిన మండపం, ట్రంకురోడ్డు లస్సీ సెంటర్లోని శివాజీ మిత్ర మండలి వారు ఏర్పాటుచేసిన వినాయకుని మండపం, పాత జడ్పీ కూడలిలో ఝాన్సీ రాణి యువసేన ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం, పెద్ద పోస్ట్ ఆఫీస్ సెంటర్లోని టీడీపీ యూత్ ఏర్పాటుచేసిన గణేశ విగ్రహాలను దర్శించుకున్నారు. ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆయన గణనాథుని ప్రార్థించారు.

# కష్టపడేవారికి..టీడీపీలో గుర్తింపు

## - - - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - - -




కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నంద్యాల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాలొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ ప్రతిష్టను పరిరక్షించుకుంటూ, పార్టీలోని ప్రతిఒక్కరూ పార్టీ శ్రేయస్సుకు పనిచేయాలని సూచించారు. రాష్ట్ర పార్టీ పరిశీలకునిగా తాను నంద్యాలకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీలోని అందరి అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు పరిశీలకులు కోవెలమూడి రవీంద్ర(గుంటూరు మేయర్), పూల నాగరాజు(ఆర్టీసీ కడప జోన్ చైర్మన్) ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పార్లమెంటు, అనుబంధ, సాధికార కమిటీల ప్రతిపాదనల స్వీకరణ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికీ.. ఆధార్ తరహాలో...ఫ్యామిలీ కార్డు

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డును ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. తాజాగా ఈనెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ కార్డులో ప్రభుత్వ పథకాలతో సహా అన్ని వివరాలు పొందుపరచవచ్చని, ఎప్పటి కప్పుడు వివరాలు అప్‌డేట్ చేస్తే బాగుంటుందని ఆయన అధికారులకు సూచించారు. కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయిలో కూడా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తుండాలన్నారు. ప్రభుత్వ పథకాల వల్ల అందరూ లబ్ది పొందేవిధంగా పథకాలను పున:పరిశీలించే విషయాన్ని కూడా ఆలోచించాలన్నారు.

**త్వరలో విలేజ్ క్లినిక్‌లు :** రాష్ట్రవ్యాప్తంగా 4472 గ్రామాల్లో విలేస్ క్లినిక్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఆమేరకు వాటికి 1129 కోట్ల రూపాయల వ్యయంతో సొంత భవనాలను నిర్మించాలని కూడా తలపెట్టింది. ఏడాదిలోగా వాటి నిర్మాణాలు పూర్తి కావాలని, మొత్తం వ్యయంలో 80 శాతాన్ని కేంద్రప్రభుత్వం భరిస్తుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

## రాష్ట్రంలో 5250 ఆలయాలకు..

# ధూప దీప నైవేద్యాలు

## - మంత్రి ఆనం వెల్లడి



ఆధ్యాత్మిక శోభతో ఆంధ్రప్రదేశ్ విలసిల్లాలని, దేవాలయాలు దేదీప్యమానంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఆయన రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన కాణిపాకంలోని శ్రీ వినాయకస్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత, కాణిపాకం వినాయకునికి ఆయన సంప్రదాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 5250 ఆలయలకు దూప దీప నైవేద్య పథకాలు అమలు చేయడం జరుగుతోందని చెప్పారు. కాణిపాకంలో అన్నప్రసాద వితరణ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, దాదాపు 4 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంక్షేమ–అభివృద్ధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ప్రజానీకానికి కాణిపాకం వరసిద్ధి శ్రీ వినాయకస్వామి అనుగ్రహం ఉండాలని ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి రంగంలో అరుదైన విశేషం

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండో పంటకు నీళ్లు ఇచ్చిన తర్వాత కూడా సుమారు 100 టిఎంసిల నీరు నిల్వ ఉండడం నెల్లూరుజిల్లా సాగునీటి రంగంలో ఒక నూతన అధ్యాయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 28వ తేదీన నెల్లూరు సంతపేటలోని తమ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితిపై మంత్రి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన జలశయాలైన సోమశిల, కండలేరు జలాశయాలు సుమారు 90 నుంచి 100 టీఎంసీల నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయని చెప్పారు. ఇది రైతాంగానికి, జిల్లా ప్రజలకు శుభపరిణామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో చేపట్టిన సమర్థవంతమైన సాగునీటి నిర్వహణ వలన నేడు జిల్లాలో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో వున్నట్లు మంత్రి వివరించారు. దాదాపు ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు సత్యవేడు, శ్రీకాళహస్తిని కలుపుకొని మొదటిపంటకు దాదాపు ఆరు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు చెప్పారు. సోమశిల, తెలుగు గంగ ప్రాజెక్టుల్లో మొదటి పంట తరువాత కూడా రెండవ పంటకు నీళ్లు అందించినా, ఇంకా మిగులు నీళ్లు ఉన్నాయన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సత్యవేడు శ్రీకాళహస్తి కలిపి రెండోపంటకు ఐదు లక్షల 24 వేల ఎకరాలకు, ఒక్క నెల్లూరు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు రెండో పంటకు నీళ్లు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో రెండో పంట చివరి దశకు వచ్చిందని, మరో 20 రోజుల్లో వరి కోతలు మొదలవుతున్నాయని చెప్పారు. సోమశిల జలాశయంలో 59 టీఎంసీలు, కండలేరు, తెలుగు గంగలో 35 టీఎంసీల నీళ్లు నిల్వ వున్నట్లు చెప్పారు. ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా, ప్రతి పంటకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. రైతన్నలు కూడా సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలి

## కార్పొరేషన్ కమిషనర్ నందన్



నెల్లూరు నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని, నగర సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 26న ఆయన నగరంలోని హరనాథపురం కూడలిలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్డు ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

లాయర్
ఆగస్టు 29, 2025

# 'చూపు లేని వారికి' వెలుగు చూపాలి!

శోభాయమానమైన ప్రకృతి అందాలతో అలరారుతున్న ఈ అందమైన లోకాన్ని చూస్తున్నవారికి జీవితం ఒక అద్భుతంగా కనిపిస్తుంది. అయితే, చూపు లేక..ఏమీ చూడలేని వారికి, జీవితమంతా అంధకారబంధురమే అవుతుంది. అందుకే 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. మనకున్న అన్ని ఇంద్రియాల్లో కళ్ళే అత్యంత ప్రధానమైనవి. కంటిచూపు లేకపోతే జీవితమంతా చీకటిమయమైపోతుంది. అంధత్వం ఒక శాపంగా మిగులుతుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు మూడున్నర కోట్ల మందికి పైగా అంధులుంటే, అందులో ఒకటిన్నర కోటి మంది మనదేశంలోనే ఉండడం గమనార్హం. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ మనదేశంలో ఏటా లక్షలాదిమంది కంటిచూపు కరువై ఎన్నో బాధలు పడుతున్నారు. 20 లక్షల మందికి పైగానే కార్నియా (నల్లగుడ్డు) సమస్యలతో అంధులవుతున్నారు. వారిలో కూడా అత్యధిక శాతం మంది బాలలే ఉంటున్నారు. అంతేకాదు, ఏటేటా అంధుల సంఖ్య లక్షల సంఖ్యలో పెరుగుతూనే ఉంది. దేశంలో ఇంతగా అంధత్వం పెరిగిపోతుండడం ఎంతో బాధాకరం. కళ్ళు కనిపించక, తమ పనులు తాము చేసుకునేందుకు కూడా అంధులు పడుతున్న అవస్తలు చూస్తే.. ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. అయితే, అంధత్వం శాపమని అనుకోకుండా, దానిని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా వేలాదిమంది వైద్యులు, వైద్యనిపుణులు నిరంతరం తమ వంతు కృషిచేస్తూనే ఉన్నారు. కోట్లాదిమందికి జయప్రదంగా కార్నియా మార్పిడి చేసి వారి జీవితాలని కాంతివంతం చేస్తూనే ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, పేరెన్నికగన్న తమిళనాడులోని మధురై కంటివైద్యశాల, హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వంటి ఎన్నో సంస్థలు, నేత్రవైద్య నిపుణులు, ఇంకా అనేక సామాజిక సేవాసంస్థల వారు అంధుల జీవితాలను అంధకారం నుంచి బయటకు తేవాలని నిత్యం అపార కృషి చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వపరంగా జిల్లాలో ఉన్న అంధత్వ నివారణ సంస్థలు, స్థానికంగా ఉండే స్వచ్ఛంధసేవా సంస్థల వారి సహకారంతో నేత్రదానానికి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. వారందరి పుణ్యమా అంటూ ఇప్పటికే కోట్లాది మంది అంధత్వం నుంచి బయటపడ్డారు కూడా.

అంధత్వానికి ప్రధానంగా కంటిలోని కార్నియా (నల్లగుడ్డు) దెబ్బతినడమే కారణమని వైద్యనిపుణులు చెప్తున్నారు. కార్నియా అనేది కంటిలో ఉండే గాజులాంటి పారదర్శకమైన ఒక సన్నటి పొర. అదే కంటిచూపుకు ముఖ్యం. కార్నియా దెబ్బతింటే కంటిచూపు మందగించి అంధత్వం ప్రాప్తిస్తుంది. కంటిలో ఉన్న కార్నియా కాంతిని చూడలేకపోవడమే కార్నియా వ్యాధి. అయితే నేటి ఆధునిక వైద్యచికిత్సలతో ఆ సమస్యల నుంచి గట్టెక్కేందుకు మార్గాలున్నాయి. కార్నియా మార్పిడి ద్వారా ఇది సాధ్యమవుతుంది. నేత్రదానం ఒక్కటే ఇలాంటి సమస్యలకు పరిష్కారం. అంధత్వం కలవారికి కంటిచూపును ప్రసాదించే మహత్తరమైన శక్తి..నేత్రదానానికి ఉంది. ఒకరి నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించవచ్చు. అయితే, నేత్రదాతలు కొరతగా ఉండడంతో, నేటికీ లక్షలాదిమంది అంధుల జీవితాలు చీకటిలోనే మగ్గిపోతున్నాయి. నేత్రదాతలే వారికి వెలుగు ప్రదాతలు. అందువల్ల ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో నేత్రదానానికి ముందుకు రావాలి. ఆ ప్రక్రియ కూడా సులభమైనదే. నేత్రదానం చేయాలనుకున్నవారు ముందుగానే తమ కుటుంబసభ్యులకు ఆ విషయం తెలిపివుండాలి. వారి మరణానంతరం వెంటనే సంబంధిత వైద్యులు, లేదా నేత్రనిధి సంస్థలకు, తెలియజేస్తే, మృతుల నుంచి కార్నియా సేకరించేందుకు వీలుంటుంది. అయితే, చాలామందిలో నేత్రదానంపై ఎన్నో అపోహలున్నాయి. కళ్లు దానం చేయడమంటే కళ్ళనే తీసేస్తారని అనుకుంటూ ఉంటారు. దానివల్ల మృతుల ముఖం వికారమైపోతుంటుందని భావించి నేత్రదానానికి నిరాకరిస్తుంటారు. కానీ అలాంటివన్నీ కేవలం అపోహలు మాత్రమే. మరణించినవారి కంటిపై ఉన్న సన్నటిపొర (కార్నియా)ను మాత్రమే వైద్యనిపుణులు సేకరిస్తారు. నేత్రదానం చేసిన మృతులకు..బతికివున్న మరొక ఇద్దరు అంధులకు కంటి వెలుగునిచ్చే పుణ్యం దక్కుతుంది. ఆమేరకు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వాలు ప్రతి ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8తేదీ వరకు దేశ వ్యాప్తంగా 'జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు' నిర్వహిస్తున్నాయి. నేత్రదాతలు సహకరిస్తే, అంధత్వాన్ని అధిగమించడం పెద్ద కష్టమేమీ కాదు. ఆ మానవీయ సేవకు అందరూ ముందుకు రావాల్సిన తరుణం ఇదే.

**(ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు)**

## విచ్చలవిడిగా వీధి కుక్కలు!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వీధి కుక్కలపై పెద్ద చర్చ జరుగుతోంది. వీధి కుక్కలతో ప్రజలు ఎక్కువ స్థాయిలో ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వాలు వాటిని షెల్టర్లకి తరలించాలని సాక్షాత్తూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఓ కేసులో తీర్పు చెప్పింది. అయితే, ఆ తీర్పు పెనువివాదాలకి దారితీయడం, డాగ్ లవర్స్ ఆ తీర్పుపై తీవ్ర అభ్యంతరం చెప్పడం మనం పత్రికలలో చదివాం, టీవీలలో చూశాం. ఆ తీర్పుని కొంత సవరిస్తూ సుప్రీం తాజాగా మరో తీర్పు ఇవ్వడం కూడా మనకి తెలిసిందే. ర్యాబిస్ వంటి ప్రమాదకర వ్యాధులు సోకిన శునకాలని మాత్రమే షెల్టర్లకి తరలించి, మిగతావాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలన్నది తాజా తీర్పు సారాంశం. అంతా బాగానే వుంది. అలా వాటికి ఆపరేషన్ చేసినంత మాత్రాన అవి జనాన్ని కరవడం మానేస్తాయా...? అన్నది నా ప్రశ్న. గ్రామాలలో, పట్టణాలలో, నగరాలలో ఈ వీధికుక్కలు అత్యంత ప్రమాదకరంగా ఉంటున్నాయి. పైశాచికంగా జనంపై పడి పీక్కుతింటున్నాయి. ఇలాంటి ఉదంతాలలో తీర్పులు చెప్పేటప్పుడు న్యాయమూర్తులు, కోర్టు తీర్పులని తప్పు పట్టేటప్పుడు సామాజిక కార్యకర్తలు.. సామాన్య జనం గురించి కూడా ఆలోచిస్తే బాగుంటుంది. **– కే.వీ.కుమార్, బాలాజీనగర్.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## బలవంతపు దండకాలు!

పండుగ అంటే పండుగే. అతి సామాన్యుడికైనా, అపర కోటీశ్వరుడికైనా పండుగ పండుగే. ఎవరెవరి స్థాయిని, స్థోమతని బట్టి వాళ్ళు పండుగ సంబరాన్ని చేసుకుంటారు. ప్రస్తుతం వినాయక చవితి సీజన్ నడుస్తోంది. ఈ పండుగను తమ తమ ఇళ్ళల్లో చేసుకోవడంతో పాటు తమ అపార్టుమెంట్లోనో, తమ వీధిలోనో లేక తమ కాలనీలోనో చేసే ఉత్సవానికి కూడా త్రుణమో పణమో సమర్పించుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఆయితే, ఇప్పుడు వ్యాపారస్తులకి కొత్త తలనొప్పి మొదలయ్యింది. కొన్ని చోట్ల రాజకీయ నేతల అనుయాయులు విగ్రహాల పేరుతో బలవంతపు దండకాలు చేయడం మొదలు పెట్టారు. తమ అపార్టుమెంట్‌లో, కాలనీలో చందా ఇవ్వడంతో పాటు ఇలా వ్యాపార సముదాయాలలో కూడా బలవంతపు చందాలు అడుగుతుంటే తామెక్కడ తేవాలి గణేశా అని తలపట్టుకుంటున్నారు. ఇలాంటి వసూళ్ళకి రాజకీయ నేతలు స్వస్తి చెప్తే మంచిది! **– ఎన్.ఎస్.రెడ్డి, ఆదిత్యనగర్.**

## రాజకీయాలమయమవుతున్న టీటీడీ!

మన రాష్ట్ర రాజకీయాలు రాను రాను మరీ దిగజారిపోతున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా గత కొన్నేళ్ళుగా దేవుళ్ళతో రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా తిరుమల తిరుపతి దేవస్థానాలని కూడా తరచూ ఏదో ఒక వివాదంలోకి లాగుతున్నారు. రాజకీయ నిరుద్యోగులకి ఎక్కడో ఒకచోట అవకాశం కల్పించే క్రమంలో టీటీడీ పాలక మండలిలో కూడా కొంతమందికి స్థానం కల్పిస్తున్నారు. అంతులేని అవినీతితో పాటు అర్థంలేని రాజకీయాలకి కూడా టీటీడీని వేదికగా చేసుకోవడం క్షమించరాని నేరం. గతంలో రాజకీయాలని అడ్డం పెట్టుకుని ఛైర్మన్ స్థానంలో స్వామివారి చెంత చేరి స్వార్థపూరిత చర్యలకి పూనుకున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ప్రస్తుతం ఎంతటి దయనీయ స్థితిలో వున్నాడో అందరికీ తెలిసిందే. కుళ్ళు రాజకీయాలకి, అవినీతి సంపాదనకి, స్వార్థ ప్రయోజనాలకు శ్రీవారి ఏడుకొండలని వేదిక చేసుకోవద్దని నయా తరం రాజకీయ నేతలకి నా విన్నపం! **– డి.హరిత, గూడూరు.**

## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 105

# నిర్లక్ష్యపు రైలు ప్రయాణం... ప్రాణాలకి ప్రమాదం!

దేశంలో రైలు ప్రమాద మృతుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే, విధివశాత్తూ అనుకోకుండా జరిగే ప్రమాదాలని మినహాయిస్తే, ప్రయాణాలలో నిర్లక్ష్యంతో అసువులు బాస్తున్న వారి సంఖ్యే ఎక్కువగా వుండడం గమనార్హం. 'రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి దుర్మరణం'... 'ప్లాట్‌ఫారమ్ మీద నుంచి రైలెక్కుతూ జారిపడి మహిళ మృతి'... 'రైలు బోగీల్లో తలుపు వద్ద కూర్చుని పొరపాటున కిందపడి విద్యార్థి కన్నుమూత'... 'కదిలే రైలు నుండి దిగబోయి ప్రాణాలు పోగొట్టుకున్న వ్యక్తి'... ఇలాంటి వార్తలు నిత్యం వింటున్నవే. ఈ తరహా ప్రమాదాలు ఏ ఒక్క ప్రాంతంలోనో కాదు, దేశవ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి. విధివశాత్తూ జరిగే ప్రమాదాల సంగతి అటుంచితే, కేవలం వ్యక్తుల నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలే అధికంగా ఉంటున్నాయి. దేశం మొత్తంగా చూస్తే, ఏటా ఈ ప్రమాదాల సంఖ్య వేలల్లోకి చేరిపోతూనే ఉంది. రైల్వేశాఖ అధికారులు ఎంతగా హెచ్చరిస్తూనే ఉన్నా, ప్రయాణీకుల్లో లోపిస్తున్న అప్రమత్తత, అంతులేని నిర్లక్ష్యం అనేకరకాల ప్రమాదాలకు మూలంగా మారాయి. దేశవ్యాప్తంగా వేలసంఖ్యలో ప్రాణాలని బలి తీసుకుంటున్నాయి. పొరపాటునో గ్రహపాటునో రైలుకింద పడితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో తలచుకుంటేనే వెన్నులో నుండి వణుకు పుడుతుంది.

ఆనవాళ్ళు గుర్తు పట్టడానికి కూడా వీలు లేని విధంగా కొంతమంది మరణిస్తున్నటువంటి ఘటనలు ప్రజల మనసులను కలచివేస్తుంటాయి. రైళ్ళలో ప్రయాణిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలెన్నో ఉన్నా, వాటినెవరూ పెద్దగా పట్టించుకోకపోవడం, కొందరు అన్నీ తెలిసినా, జాగ్రత్తలు పాటించక పోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఒక తాజా ఉదాహరణ చూస్తే ఆగస్టు 14న గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ఇద్దరు స్నేహితులు రైల్లో ప్రయాణిస్తూ, బోగీకి ఉన్న తలుపు వద్ద కూర్చుని సరదాగా మాట్లాడుకుంటున్నారు. రైలు నెల్లూరు వద్దకు చేరుకుంటుందనగా పొరపాటుగా ఇద్దరూ జారికిందపడిపోయారు. ఒకరేమో ఆసుపత్రి చేరేలోగా మరణిస్తే, మరొకరి ఆచూకీ మరుసటిరోజు ముళ్ళకంపల్లో దొరికింది. ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారు, చిన్న పొరపాటుకే పెద్ద మూల్యం చెల్లించుకుంటున్న వారి సంఖ్య నానాటికీ గణనీయంగా పెరిగిపోతూనే ఉండడం బాధాకరం.

### 'తొందర'పాటుతోనే ప్రమాదాలు :

నేటి ఆధునిక కాలంలో రైలు ఎక్కడ బయలుదేరింది, ఎక్కడ ఉందో కూడా ఫోన్ల ద్వారా తెలిసిపోతుండడం ప్రయాణీకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటోంది. రైలు వచ్చే సమయానికి ఓ అర్ధగంట ముందే రైల్వేస్టేషన్‌కి వచ్చేందుకు ఆ సాంకేతిక సమాచారం ఉపకరిస్తుంది, అయితే ఎక్కువమంది విద్యార్థులు, యువత చివరి నిమిషం దాకా మరేదో పనిలో ఉండి, రైలు బయలుదేరే సమయానికి పరుగెత్తి రావడం, ఆ తొందరలోనే ఏదోఒక ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం నిత్యకృత్యమైపోయింది. బయలుదేరిన రైలును అందుకోవాలనే ఆతృతతో పరుగెత్తి, రైలునందుకోలేక జారి, రైలు కిందపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నవారెందరో లెక్కే లేదు. రైలు పట్టాల మీద నడవడం, ముందూ వెనుకా చూసుకోకుండా రైలు గేట్ల వద్ద పట్టాలు దాటడం, బోగీల తలుపుల వద్ద గుంపుగా నిలుచుని ప్రయాణించడం వంటివి చాలా ప్రమాదం. అంతేకాదు, ఈ ఆధునిక కాలంలో కూడా అనేక ప్రాంతాల్లో రైలు గేట్లు లేకుండా, పట్టాలు దాటే పరిస్థితులు వున్నాయి. అలా తమ ఊళ్ళకు వెళ్లే గ్రామీణ ప్రాంతాల ప్రజలూ లేకపోలేదు. అలాంటి చోట్ల గతంలో కంటే ఇప్పుడు మరింత వేగంతో వస్తున్న రైళ్ళను వాళ్ళు గమనించుకోవాలి. అదేవిధంగా, పాతకాలం నాటికీ ఇప్పటికీ రైళ్ళ ప్రయాణాలకు సంబంధించి ఎన్నో మార్పులు వచ్చాయి. టిక్కెట్లు ముందుగానే రిజర్వ్ చేసుకునేదగ్గర నుంచి, రైళ్ళ ప్రయాణాల్లో భద్రంగా ఎలా ఉండాలో ప్రతి రైల్వే ప్లాట్‌ఫారమ్ నుంచి కూడా మనకు హెచ్చరికలు వస్తూనే ఉంటాయి. కొంతమేరకైనా వాటిని అవగాహన చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవు. కొన్నిసార్లు కొద్దిసమయం ముందుగానే ఒక ప్లాట్‌ఫారమ్ మీదికి రావాల్సిన రైలు, కారణాంతరాల వల్ల వేరొక ప్లాట్‌ఫారమ్ మీదికి వస్తుంటుంది. అందుకు ముందుగానే హెచ్చరికలు కూడా ఉంటాయి. అప్పటికప్పుడు అక్కడికి వెళ్ళేందుకు రైలు పట్టాలు దాటాల్సివస్తే, అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. రైలు వెళ్ళిపోతుందేమోనన్న ఆందోళనతో తోసుకోవడాలు, ఒకేసారి అందరూ బోగీలోకి వెళ్ళాలనుకుని త్వరపడడం వంటివి కూడా ప్రమాదమే. పసిబిడ్డలు, వృద్ధులతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు ఇంకా అప్రమత్తంగా ఉండాలి.

### ప్రయాణాల పట్ల అవగాహన పెరగాలి :

రైల్వేశాఖ వారు కూడా ప్రయాణాల్లో కొత్తగా వస్తున్న మార్పుచేర్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా అవగాహన పెంచాలి. ఏ సమయానికి ఏ రైలు వస్తుందోనన్న టైమ్‌టేబుల్ గతంలో అందుబాటులో ఉండేది. ఫోన్లు వచ్చాక అది మటుమాయమైనట్లుంది. స్మార్ట్‌ఫోన్లు లేనివాళ్ళు, ఉన్నా వాటిలో రైల్వేకి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోలేని వాళ్ళు కోట్లాదిగా ఉంటారనే సంగతిని రైల్వేశాఖ గుర్తుంచుకోవాలి. వారికి ఎలా అవగాహన కల్పించాలో ఆలోచించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కూడా అర్థమయ్యేవిధంగా ప్రకటనల ద్వారానో, కరపత్రాల ద్వారానో ప్రచారం నిర్వహించాలి. అంతేకాదు, రైళ్ళలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్రమాదాలకు గురికాకుండా ప్రయాణీకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజెప్పాలి. రైళ్లలో తలుపుల వద్ద ప్రయాణాలు చేయకుండా ఎప్పటికప్పుడు ప్రయాణీకులను అప్రమత్తం చేసేందుకు రైల్వే పోలీసుల పర్యవేక్షణలను మరింతగా పెంచాలి. ప్రయాణీకుల రక్షణకు, చోరీలకు గురవకుండా వారు భద్రంగా గమ్యస్థానాలు చేరేలా చూడాలి. రైల్వేశాఖ, వినియోగదారుల కమిటీలు తరచూ సమీక్షలు జరిపి మేలైన విధానాలతో సురక్షితంగా ప్రయాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలి. రైలు ప్రయాణం ప్రాణాలకి ప్రమాదం అన్న అపోహని పోగొట్టాలి!

**- రాజశ్రీ**

# దేవాలయాలపై వైకాపా డైవర్షన్ పాలిటిక్స్

## కూటమి ప్రభుత్వం వచ్చాకనే.. ఆలయాలకి వెలుగులు

### - - - దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టీకరణ - - -

గత వైకాపా హయాంలో దేవాలయాల అభివృద్ధిని పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు తమ దుర్మార్గాలను కప్పిపుచ్చుకోవడానికి వైకాపా నేతలు దేవాలయాలపై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దుయ్యబట్టారు. అమరావతిలో ఇటీవల ఆయన వైకాపా తీరు గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో హిందూ ధర్మం, ఆచారాలను రాజకీయ ఉచ్చులోకి లాగే వైకాపా ధోరణి బాధాకరమన్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని వైకాపా దేవాలయాలపై రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైకాపా కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. జగన్ దిగజారుడు రాజకీయాల కోసం దేవుడినే వాడుకుంటున్నాడంటూ ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాకనే దేవాలయాలకు మళ్ళీ వెలుగులు వచ్చాయని, ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే దేవాలయాల ప్రక్షాళనకు అనేక



కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. అర్చకుల వేతనం 10 వేల నుంచి 15వేలకు పెంచామని, రూ.777 కోట్లతో 377 ఆలయాల పునర్నిర్మాణ ప్రణాళిక అమలుచేస్తూ, ఇప్పటికే 206 ఆలయాల్లో పనులు కూడా ప్రారంభమయ్యాయని ఆయన వివరించారు. టీటీడీ పవిత్రతను కాపాడుతూ, తిరుమలను ప్రపంచ ప్రఖ్యాత ఆదర్శ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత విఖ్యాతిని కలిగించడం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని తెలిపారు. వైకాపా లిక్కర్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, అంతేకాక వైకాపా భూదోపిడీల్లో రోజుకో కొత్త విషయం బయటపడుతూనే ఉందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

### ఆంధ్రకేసరి టంగుటూరి

# సాహసం మరువలేం

### జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ఆంధ్రకేసరిగా పేరుగాంచిన ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సాహసాలను, స్వాతంత్ర్యోద్యమానికి ఆయన చేసిన సేవలను ఏనాటికీ మరచిపోలేమని నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. టంగుటూరి జయంతి సందర్భంగా స్థానిక జడ్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అప్పట్లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో బ్రిటిష్ సైన్యం తుపాకులకు సైతం ఎదురొడ్డి నిలిచారని, ఆ సాహసానికి గుర్తుగా ఆయన్ను ఆంధ్రకేసరి అని పిలవడం మొదలైందని గుర్తు చేశారు. ఆయన పేరుమీదే 'ప్రకాశం జిల్లా' ఏర్పడిందన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, రాజకీయ యోధునిగా రాష్ట్రానికి ఆయన ఎనలేని సేవలందించారని, అందరూ ఆ మహనీయుని స్ఫూర్తిని అందిపుచ్చుకుని దేశాభ్యున్నతికి కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీప్రసన్న, జిల్లా ప్రజా పరిషత్ సీఇఓ జె.మోహన్‌రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గురునిలయంలో 29న.. వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేటలోని గురునిలయంలో, శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావు స్వామి వారి నివాసంలో ఈనెల 29న అవధూత..భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 43వ ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 28న స్వామివారి నామసంకీర్తనంతో భిక్షాటన కార్యక్రమం ఉంటుందని, అనంతరం వెంకయ్యస్వామి-మాకాని వెంకట్రావుస్వామి వార్లకు అభిషేకపూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు మాకాని గోపి తెలిపారు. 29న జరిగే ఆరాధనోత్సవంలో వెంకయ్యస్వామి సేవలో పునీతులైన తలుపూరు శ్రీ నారాయణదాసు స్వామి, గాలిపాళెం శ్రీహరిస్వామితో పాటు శ్రీ వటుకనాథస్వామి, అవధూత కాంతమ్మతల్లి శిష్యుడు సుబ్బారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివార్ల సందేశాలను వినిపిస్తారని చెప్పారు. ఈ సందర్భంగాఉదయం 9 గంటలకు గురుదేవుల భక్తబృందం భజనలు, అనంతరం అన్నదానం ఉంటాయని, సాయంత్రం 6 గంటలకు సాయిదర్బార్ అద్దాలమందిరం భక్తులతో భజనలు, 7 గంటలకు నగరోత్సవం, అనంతరం విఘ్నేశ్వర నృత్య నికేతన్ చిన్నారుల నృత్యప్రదర్శనలు ఏర్పాటుచేశామన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### శ్రీదత్త గురు ధ్యాన నిలయంలో..

## ప్రత్యేక పూజలు

అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు సమీపంలోని గొలగమూడిలో ఉన్న శ్రీ దత్త గురు ధ్యాన నిలయంలో ఈనెల24న ప్రత్యేక పూజలు జరిగాయి. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారికి, శ్రీ దత్త స్వామికి, శ్రీ సాయినాథునికి విశేష అలంకారాలు, అభిషేకాలు చేశారు. ఆ రోజంతా స్వామివార్ల భజనలతో భక్తులు పరవశించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. గురు ధ్యాన నిలయం వారు ఈ పూజలను పర్యవేక్షించారు.

### కసుమూరు దర్గాలో..18 నుంచి

## గంధమహోత్సవాలు

రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లో సైతం పేరెన్నికగన్న నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని కసుమూరులో ఉన్న పవిత్రమైన మస్తాన్‌వలీ దర్గా 248వ గంధ మహోత్సవాలు సెప్టెంబరు 18 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి ఈనెల 24వ తేదీ రాత్రి కసుమూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం నిషాన్ ఫాతెహా కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. దర్గా ముజావర్ల ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు వేలసంఖ్యలో పాల్గొంటారు కనుక దర్గా నిర్వాహకులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఈనెల 30న కంభల్ ఫాతేహా కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

## 31న..'వేద విజ్ఞాన వేదిక' సభ

చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఆగస్టు 31న 164వ ప్రసంగ కార్యక్రమం ఏర్పాటైంది. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు టీ.నగర్‌లోని కృష్ణాహాల్, ఆంధ్రాక్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో విజయవాడకి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు-రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొని 'తెలుగు సినిమాల్లోని మనసు పాటలు' అనే అంశంపై ఉపన్యసిస్తారని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు.

### దేశంలో ఎక్కడా లేనివిధంగా..

# స్మార్ట్ రేషన్ కార్డులు

- కొనియాడిన విపిఆర్ దంపతులు



ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత తెచ్చేలా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తమ కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 25న కోవూరు పంచాయతీలోని పెళ్ళకూరుకాలనీలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను వారు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారికి ప్రభుత్వం తరపున అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా నాలుగు దశల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కోటీ 45 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా రేషన్ సరఫరాలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేలా స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చిందని వివరించారు. జిల్లాలో 7.10 లక్షల కార్డులు వచ్చాయని వివరించారు. కోవూరు నియోజకవర్గంలో 95 వేల రేషన్ కార్డులకు గాను 94 వేల స్మార్ట్ కార్డ్స్ కార్డులు వచ్చాయని తెలిపారు. ఎవరికైనా రేషన్ కార్డులు అందకపోతే సమీప సచివాలయంలో సంప్రదించి తీసుకోవాలని సూచించారు.

# అలక్ష్యపు అధికారులకు మెమోలు

తమ సమస్యలు తీర్చాలంటూ ఎంతో వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీలిస్తున్నా అవి అత్యధికశాతం పరిష్కారం కాకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆయా అధికారుల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్న పలువురు అధికారులకు మెమోలు కూడా ఇవ్వడంతో అధికారవర్గాల్లో కలకలం సృష్టించింది. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, విద్యాశాఖ, వక్ఫ్‌బోర్డు శాఖల పరిధిలోని అర్జీలు సక్రమంగా పరిష్కరించడం లేదంటూ కలెక్టర్ ఆయాశాఖల అధికారులకు ఈనెల 25న మెమోలు జారీ చేశారు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. అన్నిశాఖల అధికారులు, తమ పరిధిలోని ఆ అర్జీల పరిస్థితి ఇప్పుడెలా ఉందో ఆగమేఘాలపై తెలుసుకుంటున్నారు. పరిష్కారం కాని అర్జీలపై దృష్టిపెట్టారు. ఈనెల 25న సోమవారం ఒక్కరోజునే 426 అర్జీలు వచ్చాయి. ప్రతి సోమవారం ఇలా పెద్దసంఖ్యలో అర్జీలు వస్తుండడంతో, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతమాత్రం అలసత్వం ఉండకూడదని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆయన మాట్లాడుతూ, ప్రధానంగా ప్రజలు భూసమస్యలు, రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా అర్జీలిస్తున్నారని, సంబంధిత అధికారులు వెంటనే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించకుంటే అందుకు కారణాలేమిటో అర్జీదారులకు వివరించాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి



వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేసుకోవాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈనెల 24న నెల్లూరు పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో కొండ ప్రవీణ్ శంకర్ చారిటబుల్ ట్రస్ట్, నుడా మాజీ ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు శ్రీధర్, మెడికల్ విభాగం అధ్యక్షుడు ప్రదీప్, కన్యకా పరమేశ్వరి దేవస్థానం మాజీ ఛైర్మన్ శ్రీరామ్ సురేష్, జ్యోతి ప్రసాద్, సుధాకర్, ఐతా భాస్కర్, వీర, తులసి శ్రీకళ, రాధా, విజయలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయ ప్రయోగశాలకు..
# జాతీయస్థాయి గుర్తింపు



నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎరువులు, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలకు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. రైతులకు ఎరువుల నాణ్యత, నేల సారంవంతంపై మెరుగైన సలహాలు అందిస్తున్నందుకు నెల్లూరు వ్యవసాయ ప్రయోగశాలకు ఎన్ఏబీఎల్(నేషనల్ బోర్డ్ ఫర్ అగ్రిడిటేషన్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్) గుర్తింపు లభించడం జిల్లాకు ఎంతో గర్వకారణం. రాష్ట్రం లోనే మొట్టమొదటిసారిగా నెల్లూరులోని అగ్రికల్చర్ ల్యాబ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, సిబ్బందిని కలెక్టర్ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు.

# విద్యార్థులు క్రీడాకారులుగా రాణించాలి



మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడ తాయని, విద్యార్థులంతా మంచి క్రీడాకారులుగా రాణించి ఉన్నత శిఖరా లను అధిరోహించాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరం లోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో యోనెక్స్-సన్ రైజ్ సంస్థ సారథ్యంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాకారులుగా రాణించాలన్నారు. విజేతలుగా నిలిచిన యువకులకు భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు.

# వీఎస్‌యులో జాతీయ అంతరిక్ష దినోత్సవం

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇటీవల జాతీయ అంతరిక్ష దినోత్సవం జరిగింది. ఫిజిక్స్ విభాగం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు వక్తృత్వం, వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వీఎస్‌యు కళాశాల విద్యార్థులు మరియు అనుబంధ కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీఎస్‌యు రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధన దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుం దన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం మాత్రమే కాకుండా, సృజనాత్మక ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆమె ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ, ఫిజిక్స్ విభాగాధిపతి డా. ఎ.శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

# పర్యాటకరంగం అభివృద్ధికి చర్యలు



జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని టూరిజం అతిథి గృహంలో ఆధునీకరించిన పర్యాటక శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, కార్యాలయం చాలా బాగుందని కితాబిచ్చారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటుచేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, మ్యూజియంలు, బీచ్‌ల విశేషాలను, అక్కడ కలుగజేస్తున్న వసతి సౌకర్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు ఆహ్లాదం అందించడమే లక్ష్యంగా పర్యాటక కేంద్రాలను తీర్చిదిద్దాలని సూచించారు. పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తహశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఉచిత బస్సులతో..మహిళల్లో ఆనందం

## —జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్



కూటమి ప్రభుత్వం చెప్పినమాట నిలబెట్టు కుంటూ 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాల సౌకర్యం కలుగజేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో ఆనందం వెల్లువెత్తు తోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో కూడా ఆ పథకం ఆగస్టు15న ప్రారంభమైంది. 22వతేదీ వరకు.. తొలి వారం లోనే జిల్లాలో 7,64,311 మంది మహిళలు ఉచిత ప్రయాణ వసతిని వినియోగించుకోవడం విశేషం. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి మూడు రకాల బస్‌లలో మొత్తం 14,88,537 మంది ప్రయాణిం చగా, వీరిలో మహిళలు 7,64,311 మంది ఉన్నారని, టికెట్లు తీసుకుని ప్రయాణించిన పురుషులు 7,24,226 మంది ఉన్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ తెలిపారు. ఈ వారం రోజుల్లో మహిళలకు రు.2,91,98,935 మేర లబ్ధి కలిగిందన్నారు. స్త్రీశక్తి పథకం మొదల య్యాక పురుష ప్రయాణికుల సంఖ్య 48.65 శాతంగా ఉండగా, మహిళా ప్రయాణికుల సంఖ్య 51.35 శాతానికి పెరిగినట్లు ఆమె వివరించారు.

# కాలుష్యమండలి..మట్టి వినాయక ప్రతిమలు

వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు ఈనెల 26వ తేదీన మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి ఎన్ అశోక్‌కుమార్, పర్యావరణ ఇంజనీర్‌ల ఆధ్వర్యంలో నెల్లూరులోని ఫతేఖాన్‌పేట రైతుబజార్ కూడలి వద్ద ఆమేరకు స్టాల్‌ను ఏర్పాటుచేసి,



దాదాపు 3వేల మట్టి ప్రతిమలను తయారుచేయించి ఆర్డీఓ ఎన్ఎన్ అనూష చేతులమీదుగా ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, రసాయనిక రంగుల వల్ల పర్యావరణం కలుషితం కావడమే కాక, వాటిని నీళ్ళలో నిమజ్జనం చేయడం వల్ల జలచరాలకు కూడా హాని కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి వారు ఏర్పాటుచేసిన కళాజాత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. డీకెడబ్ల్యు కాలేజీకి చెందిన రజని ఆధ్వర్యంలో ఏపీ క్లైమేట్ యాక్షన్ గ్రూప్ వారు, వలంటీర్లు, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ అర్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసంలో ఇటీవల యువ నాయకుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అర్జున్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వదించారు. కోవూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదానం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలోని రక్తనిధి కన్వీనర్ సి.హెచ్.అజయ్ బాబు తన పుట్టిరోజు సందర్భంగా, స్థానిక మెడికవర్ ఆసుపత్రిలోని ఓ రోగి ప్రాణాలు నిలబెట్టడం కోసం 114వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానమంటే ప్రాణ దానమేనని, రక్తనిధిలో రక్తం కొరత లేకుండా నిల్వలుపెంచడం కోసం, అత్యవసర సమయాల్లో నిరుపేద రోగులకు, బాధితులకు రక్తం దానం చేయడం కోసం రక్తం ఎంతో అవసరమన్నారు. అందుకోసం ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రక్తనిధి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, మోటివేటర్ అరిగెల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..కాత్యాయని వ్రతం



నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 26న కాత్యాయని వ్రతం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయప్రాంగణంలోని అనివెట్టి మండపంలో అమ్మవారికి విశేష పుష్పా లంకరణలు చేసి కాత్యాయని వ్రతం నిర్వహించారు. అనేకమంది భక్తులు ఈ వ్రతపూజల్లో పాల్గొన్నారు. ఈ వ్రతం చేయడం వల్ల అందరికీ శుభాలు చేకూరుతాయని, వధూవరులకు జాతకరీత్యా కుజదోషం, కాలసర్పదోషం వంటివి తొలగిపోతాయని, స్త్రీలు సౌభాగ్యం కోసం ఈ వ్రతం చేస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ వ్రతం నిర్వహించారు.

# ఫ్రెండ్స్ వాకర్స్..'శతమానం భవతి'



నెల్లూరులోని ఏసీ స్టేడియం ప్రాంగణంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న 'శతమానం భవతి' కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ నెలలో జన్మించిన వాకర్స్ సభ్యులందరికీ కండువాలు కప్పి, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్తూ వాకర్స్ నాయకులు శుభాశీస్సుల పత్రాన్ని అందజేశారు. తొలుత, కేకు కట్‌చేసి అందరికీ శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, మాజీ ప్రెసిడెంట్..203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, షేక్ నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్యనాయుడు, పిట్ల రాజారావు, డి.దేవదానం, కిలారి మధుసూదన రావు, బి.విజయరాఘవేంద్ర, టి.ఆనందరావు, బెజవాడ సునీల్‌రెడ్డి, ఎస్‌కె మొహ్మద్ రఫీ, పి. రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విపిఆర్ ఇంట.. మంత్రి 'అనగాని'

ఇటీవల నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) మాగుంట లేఔట్‌లోని తమ నివాసంలో సమావేశ మయ్యారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు అందించిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో తెలుగుదేశంపార్టీ బలోపేతం మరియు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్‌లు చర్చించారు. ఈ భేటీలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పర్యావరణ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ ఛైర్మెన్ జెడ్ శివప్రసాద్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రితో పాటు నెల్లూరు పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష ఎన్నికకు సంబంధించి త్రిసభ్య కమిటీలో సభ్యులైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మెన్ డూండి రాకేష్‌లు కూడా ఉన్నారు.

# పారదర్శకంగా ప్రజాపంపిణీ వ్యవస్థ!

## అక్రమాలకు చెక్ పెట్టేందుకే స్మార్ట్ కార్డులు - మంత్రి నారాయణ



ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గత వైకాపా పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పటిష్టమైన చర్యలు తీసుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 26న ఆయన నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 48వ డివిజన్ పొర్లుకట్ట వద్ద లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పేదలకు ఇచ్చే నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలకు ఉచిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు ఇంటింటికీ స్మార్ట్ కార్డులు పంపిణీ జరుగుతుందని, సెప్టెంబర్ 1వ తేదీ తరువాత రేషన్ షాపుల వద్ద కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు. నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలో 63, 419 కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్,కమిషనర్ నందన్, ఆర్డీఓ అనూష, ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైపాడు బీచ్..జిల్లాకి వరం!

## త్వరలోనే కేరళ తరహాలో అభివృద్ధి - కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



నెల్లూరుజిల్లాకి మైపాడు బీచ్ ఒక వరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆమె జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలసి, మైపాడులో నిర్వహించిన బీచ్ అభివృద్ధికి జరిగిన మాస్టర్ ప్లాన్ కార్యక్రమం చర్చలో ఆమె పాల్గొన్నారు. ఆ బీచ్‌ని కేరళ తరహా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావిస్తున్నారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. మైపాడు-నెల్లూరు రహదారి త్వరతగతిన పూర్తి చేసి మైపాడు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వారాంతంలో కుటుంబ సమేతంగా సరదాగా గడపాలంటే నెల్లూరు జిల్లాలో ఉన్న ఏకైక పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం శిలా ఫలకానికే పరిమితమైన మైపాడు-నెల్లూరు రహదారి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కదలిక వచ్చిందని, త్వరలోనే దానికి ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. మైపాడులో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటల్స్, రిసార్టులు, హోమ్ స్టేలు, ఫుడ్ కోర్టులు వంటి సౌకర్యాల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. టూరిస్టుల భద్రత కోసం బీచ్‌లో లైఫ్ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మైపాడు బీచ్‌తో పాటు ఇందుకూరుపేట మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. అనంతరం బీచ్ సమీపంలో నిర్మిస్తున్న బంగారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించి ద్వారబంధం ప్రతిష్ట కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మైపాడు బీచ్ సమీపంలో వున్న ఉప్పు కాలువలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పీ-4 కార్యక్రమం ద్వారా సిల్ట్ క్లియరెన్స్‌కు ముందుకు వచ్చిన స్థానికులను ఆమె అభినందించారు. సిల్ట్ క్లియరెన్స్ చేయడం ద్వారా మత్స్యకారుల బోట్లు నేరుగా సముద్రంలో వెళ్లేందుకు మార్గం సుగమనం అవుతుందన్నారు. దాదాపు 6 కిలోమీటర్లు ఉన్న ఉప్పు కాలవలో కేరళ తరహా బోట్ రైడింగ్స్ నిర్వహించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించ వచ్చన్నారు. పెన్నానదిపై ముదివర్తి - ముదివర్తిపాళెం కాజ్ వే నిర్మాణం పూర్తయితే ఇందుకూరు పేట - విడవలూరు మండలాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. బ్యారేజ్ వద్ద నిల్వ వున్న నీళ్లు భూమిలోనికి ఇంకడం ద్వారా తీరప్రాంత వాసులు ఎదుర్కొంటున్న ఉప్పునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో పాటు ఇందుకూరుపేట తహశీల్దారు గోపీకృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర, మండల టీడీపీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మెగాస్టార్ చిరంజీవి..

# నేటి యువతకు స్ఫూర్తి!

### - రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రముఖ సినీ హీరో..మెగాస్టార్, పద్మవిభూషణ్ కొణిదల చిరంజీవి నేటి యువతకు మార్గదర్శకమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. చిరు 70వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలకు వచ్చిన చిరంజీవిని మంత్రి కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సినీ రంగంలోనే కాక, రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో కూడా మెగాస్టార్ చిరంజీవి ఉన్నత శిఖరాలను అధిరోహించారని, వారి జీవితం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. రోగార్తులకు, బాధితులకు రక్తదానం చేసేందుకు మెగాస్టార్ చొరవతో రక్తదాన శిబిరాలెన్నో నిర్వహిస్తున్నారని, చిరంజీవి అభిమానులకు తద్వారా దేశవ్యాప్త గుర్తింపు కూడా లభిస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేకించి ఆనం కుటుంబానికి అత్యంత ఆప్తులైన చిరంజీవికి తాను హృదయపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానని, చిరంజీవి.. వారి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంతో ప్రజాసేవలో నిండునూరేళ్ళు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



# ఆత్మీయ కలయిక

హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, డిఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డా.సతీష్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ తన 'ఆత్మకథ' పుస్తకాన్ని సతీష్‌రెడ్డి దంపతులకు అందజేశారు.

# 1 నుంచి పోషకాహార మాసోత్సవాలు

సెప్టెంబరు 1వ తేదీ నుంచి జిల్లాలో పోషకాహార మాసోత్సవాల నిర్వహణకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలు కలిగిన ఆహారం పిల్లలు, తల్లులకు, గర్భిణులకు ఎంత ముఖ్యమో వివరించనున్నారు. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పర్యవేక్షణలో ఈ మాసోత్సవాలు జరుగనున్నాయి.




# కాపువీధి గణేశునికి.. ఆనం పూజలు



వినాయక చవితి రోజున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు నగరంలోని కాపువీధి వినాయక మండపాన్ని సందర్శించి, గణేశునికి విశేష పూజలు చేశారు. నగరంలోని కాపువీధి ఎంతోకాలంగా తమ కుటుంబంతో మమేకమైన వీధి అని ఆయన అంటూ, అక్కడున్న వారందరినీ ఆత్మీయంగా పలకరించి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో..

# శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

### వేలాదిగా తరలివచ్చిన భక్తజనులు

### స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సోమిరెడ్డి దంపతులు



వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలో కొలువై ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 43వ ఆరాధనా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆగస్టు 18 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఈ ఉత్సవాల్లో జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిమంది భక్తజనం తరలివచ్చారు. నిత్యం జరిగే పూజలు, వాహన సేవల్లో పాల్గొని స్వామివారిని ఆరాధించారు. ఆకలైన వారికి అన్నం పెట్టాలయ్యా, ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా అంటూ మానవీయ బోధనలు చేసిన ఆ అవధూతమూర్తిని దర్శించుకుని తరించారు..ఓం నారాయణ..ఆదినారాయణ అంటూ భక్తజనులు పెద్దపెట్టున నామోచ్చరణలు చేస్తూ, స్వామివారి వాహనసేవల్లో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామివారి పుష్కరిణిలో తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది.

శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవాల్లో చివరిరోజైన 24వ తేదీ ఆదివారం రోజున భక్తులు మరింత పెద్దసంఖ్యలో తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా క్రిక్కిరిసిపోయింది. ఉదయం 10 గంటలకు జరిగిన రథోత్సవంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం, పలువురు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం సోమిరెడ్డి దంపతులు సంప్రదాయబద్ధంగా శ్రీ వెంకయ్యస్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉండాలని, ప్రజలందరికీ మేలు కలగాలని శ్రీ వెంకయ్యస్వామివారిని తాము కోరుకున్నట్లు ఆయన చెప్పారు. వెంకయ్యస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతుండటం గొప్ప విషయమని, ఆశ్రమ పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉచితంగా విద్యాభ్యాసం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇక్కడ జూనియర్ కళాశాల ప్రారంభించే సన్నాహాలు కూడా జరుగుతున్నాయన్నారు. భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆశ్రమం సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ బాలసుబ్రహ్మణ్యంతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కొత్త భానూదయం ఖాయం

మనసులో మాట 60

ప్రపంచంలోని ప్రతిభావంతులను వలస విధానాలతో ఆకర్షించి తన పౌరులుగా మార్చుకున్న అమెరికా ఇప్పటివరకు బాగానే లబ్ధి పొందింది. ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక, రాజకీయ, సైనికశక్తిగా అవతరించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పెద్దన్నగా అవతరించడానికి, ప్రపంచం నలుమూలలా తన మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవడానికి అసలు సిసలైన పునాది అమెరికా అనుసరిస్తూ వచ్చిన వలస విధానమే. తమ తమ దేశాల్లో తమ ప్రతిభకు తగ్గ అవకాశాలు లేని ఎందరో ప్రతిభావంతులు అమెరికాకు చేరి అక్కడి అవకాశాలను అందిపుచ్చుకుని ఎన్నో ఆవిష్కరణలు చేశారు. దశాబ్దాలుగా భారత్, చైనా వంటి దేశాల నుంచి ఎందరో అమెరికా, ఇతర పశ్చిమదేశాలకు వలస వెళ్లారు. వ్యక్తిగతంగా వారితో పాటు ఆయా దేశాల పురోభివృద్ధికి తోడ్పడ్డారు. ముఖ్యంగా అమెరికాను గొప్ప వ్యవస్థగా తీర్చిదిద్దారు. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా వలసల విధానం ఒడిదుడుకులకు లోనవుతోంది. బయటి దేశాల నుంచి వచ్చేవారిని అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తున్నారు. ఇదే వైఖరి కొనసాగితే అమెరికాకు ప్రతిభావంతుల రాక గణనీయంగా తగ్గిపోవడం ఖాయం. దానికి తోడు సుంకాల మోత ఒకటి. దీంతో భారత్ సహా పలు దేశాలు స్వయం సమృద్ధిపై తీవ్రంగా దృష్టిపెట్టాయి. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలతో సిద్ధమవుతున్నాయి. అమెరికా వైఖరి ఇలాగే కొనసాగితే ఆ దేశం క్రమంగా వెనకబడిపోవడం ఖాయం.

ఈ పరిస్థితిని జాగ్రత్తగా అంచనా వేస్తున్న చైనా దీన్నొక మంచి అవకాశంగా మలచుకోవాలనుకుంటోంది. ఇప్పటి వరకు సొంత ఆవిష్కరణలతో లేదా రివర్స్ ఇంజినీరింగ్‌తో అమెరికాకు పోటీ ఇస్తున్న చైనా ఇక ముందు ప్రపంచంలోని ప్రతిభావంతులను ఆకర్షించే పని మొదలుపెట్టింది. ఇప్పటివరకు ప్రతిభావంతులకు గమ్యస్థానంగా అమెరికా ఉన్నట్లుగా ఇక ముందు తాను ఉండాలని చైనా భావిస్తోంది. అందుకు అనుగుణంగా వలస విధానాల్లో సంస్కరణలు చేపడుతోంది. సరైన సమయంలో చైనా తన వలస విధానాన్ని మార్చుకుంది. ఇది సరైన సమయం ఎందుకు అంటే- ఇప్పటి వరకు శిలాజ ఇంధనం ప్రపంచాన్ని శాసించింది. శిలాజ ఇంధన వనరులు పుష్కలంగా ఉన్న అమెరికా ప్రపంచ వ్యాప్తంగా ఇంధన విధానాలను ప్రభావితం చేస్తూ, నియంత్రిస్తూ ప్రపంచాన్ని శాసిస్తూ వచ్చింది. గల్ఫ్ దేశాల్లో శిలాజ ఇంధన వనరులు పుష్కలంగా ఉన్నా ఇతర వనరులు లేకపోవడంతో ఆ దేశాలను కూడా అమెరికా గుప్పెట్లో పెట్టుకుంది. ఇప్పుడు శిలాజ ఇంధన వనరులకు క్రమంగా ప్రాధాన్యం తగ్గుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై వివిధ దేశాలు దృష్టిపెట్టాయి. భూతాపాన్ని అరికట్టడానికి శిలాజ ఇంధనాన్ని తగ్గించి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. ఎక్కడ తన పట్టు తగ్గిపోతుందో అని ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల విధానాన్ని నీరుకారుస్తోంది. కానీ చైనా, భారత్ వంటి దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టిపెట్టాయి. ముఖ్యంగా చైనా ఈ అంశంపై తీవ్రంగా దృష్టిపెట్టింది. ప్రత్యామ్నాయ హరిత ఇంధనం, క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ వంటి రూపాల్లో ముందుకు వస్తున్నది. చమురుతో పని లేకుండా నడిచే విద్యుత్ వాహనాలు పరుగులు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో 2035 నాటికి అమెరికాను అధిగమించేందుకు చైనా కంకణం కట్టుకుంది. ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి అంటే విప్లవదినోత్సవం రోజు నుంచి చైనా ప్రభుత్వం ప్రపంచంలోని యువ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు 'కె' రకం వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. కొత్తగా పట్టా పుచ్చుకున్న స్వదేశీయులు లేదా విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారు, ఇతర దేశాల్లో ఇప్పటికే ఆయా రంగాలలో పని చేస్తున్న వారిని ఆకర్షించేందుకు పూనుకుంది. ఇటీవలి కాలంలో చైనా విధాన నిర్ణయాలలో ఇదే అత్యంత ముఖ్యమైన నిర్ణయం. స్టెమ్(సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) రంగాలలో ప్రతిభావంతులైన విదేశీ యువతను ఆకర్షించేందుకు తీసుకువస్తున్న 'కె' వీసా ప్రత్యేకత ఏమంటే చైనాలో ఉన్న కంపెనీల యజమానులు లేదా సంస్థల నుంచి సిఫార్సులు లేకుండానే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి కూడా లేదు. ఇతర దేశాలతో పోటీ పడుతూ వేతనాలు, వసతి, బోనస్, పిల్లలకు విద్య వంటి ఇతర సౌకర్యాలను కల్పిస్తారు.

అమెరికాలో భారత్, చైనా, ఇతర ఆసియా సంతతికి చెందిన వారి మీద పెరుగుతున్న జాత్యహంకార వివక్ష, ఆంక్షలు, పరిశోధనలకు కేటాయింపుల కోత వంటి వాటి కారణంగా ప్రతిభావంతులు మెరుగైన అవకాశాల కోసం చూస్తున్న నేపథ్యంలో చైనా తీసుకొచ్చిన 'కె' వీసా ప్రపంచస్థాయిలో గేమ్‌ఛేంజర్‌గా భావించవచ్చు. దశాబ్దాల తరబడి, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మేధోవలసతో చాలా ప్రయోజనం పొందాయి. ఇప్పుడు పరిస్థితి తారుమారు కాబోతోంది. మరోవైపు భారత్ కూడా స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. హరిత ఇంధనం, క్వాంటం కంప్యూటింగ్‌లో పెట్టుబడులను ఆకర్షిస్తూ ఈ రంగాల్లో పరిశోధనలను ముమ్మరం చేయాలని నిర్ణయించుకుంది. చైనాతో సరిహద్దు విభేదాలను త్వరగా పరిష్కరించుకోవాలని నిర్ణయించింది. ఈ దిశగా ఇటీవల కాలంలో చర్చలు ముమ్మరమయ్యాయి. రెండు దేశాల మధ్య విభేదాలు పరిష్కారమయితే పశ్చిమ దేశాల అహంకార ధోరణికి అడ్డుకట్టపడడం ఖాయం. సూర్యుడు ఎల్లప్పుడూ తూర్పున ఉదయిస్తాడు. సూర్యుడితో పాటు వెలుగు ప్రసరణ ప్రారంభమవుతుంది. తూర్పు దిశ నుంచే మొదటి కాంతి... చీకట్లను తొలగించి ప్రపంచాన్ని మేల్కొలుపుతుంది. తూర్పునే ఉన్న భారత్ జ్ఞానం, విజ్ఞానం, అభివృద్ధికి పునాది అయిన భూమి. ఉదయించే సూర్యుడు కొత్త దినాన్ని ఆరంభించినట్టే, కొత్త యుగానికి మార్గదర్శకమైన జ్ఞానప్రభ మళ్లీ ఇక్కడినుంచే ప్రారంభమవడం ఖాయం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్




## హామీలు అమలుచేయాలంటూ ఎస్ఎఫ్ఐ డిమాండ్

టీడీపీ నేతలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఇటీవల పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 22న వారు నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యలు తీరుస్తామంటూ టీడీపీ నేతలు ఎన్నికలప్పుడు వాగ్దానం చేశారని, అయితే అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా విద్యార్థుల కష్టాలు ఆలకించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నేటికీ చెల్లించలేదని, ఇకనైనా 77 నంబరు జీఓని రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా, హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థులకు నెలకు 3వేల రూపాయల వంతున మెస్‌బిల్లు చెల్లించాలని, అర్హులైన విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' పథకం కింద ఎలాంటి షరతులు లేకుండా రూ.15వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సమస్యలు తీరక విద్యార్థులంతా అవస్థలు పడుతున్నారని, నెలలు గడిచిపోతున్నా తమ బాధలను పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. ఆమేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి అందజేశారు.

## సీతారామపురంలో విద్యార్థులు.. బస్సుకోసం బైఠాయింపు

తమకు బస్సు సదుపాయం కావాలంటూ ఇటీవల మండల కేంద్రమైన సీతారామపురంలో పలువురు విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. సీతారామపురం నుంచి డీజీపేట మార్గంలో ఉన్న పబ్బులేటిపల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై విద్యార్థులు బైఠాయించారు. ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి పల్లెవెలుగు బస్సు ఒకటి ఒక ట్రిప్పు మాత్రమే డీజీ పేట వరకు వెళ్లి వస్తుందని, ఈ మార్గంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆ బస్సొక్కటే ఆధారంగా ఉందని, ఆ బస్సు చాలక ఇరుకుని ప్రయాణం చేయడం రోజూ ఎంతో ఇబ్బందిగా ఉందంటూ విద్యార్థులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రెండు పూటలా ఆర్టీసీ బస్సు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ వెసులుబాటు కూడా లేకపోవడంతో క్రిక్కిరిసిన బస్సులో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి ఉందని వారు తెలిపారు.

ఇకనైనా ఉదయగిరి ఆర్టీసీ డిపోవారు విద్యార్థుల బాధలు గమనించి, మరో అదనపు బస్సును డీజీపేట మార్గంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలకై రైతుల ఆందోళన

జిల్లాలో అనేక ప్రాంతాల్లో వరికోతలు మొదలైనా, రాష్ట్రప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 24న అనంతసాగరంలో జరిగిన రైతు మహాసభలో పలువురు రైతు నాయకులు మాట్లాడుతూ, రైతులకు సకాలంలో యూరియా ఎరువును అందించడంలోకానీ, రైతుల సమస్యలు పరిష్కరించడంలో కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగానే ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కోసం రైతులు పోరాటం చేయాల్సి ఉందన్నారు. ప్రతియేటా వ్యవసాయ సీజన్‌లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మూలి వెంగయ్య, ఉపాధ్యక్షులు లక్కు ప్రసాద్, సీఐటీయు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందికదా అని..విర్రవీగేది ఉండదు

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



తమకు అధికారం ఉందని విర్రవీగే దేమీ ఉండదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరిన సందర్భంగా నెల్లూరులోని వేదాయపాళెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తొలుత, తమ పార్టీలోకి వచ్చిన వైసీపీ నేతలకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీమకి కూడా తామెప్పుడూ హాని చేయమన్నారు. తమ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్యాయాలు, అక్రమాలకు పూర్తిగా చెక్ పెట్టామని తెలిపారు. ఎవరైనా పొరపాట్లు చేసినా సరికాదని మందలిస్తామే తప్ప, తప్పులను ప్రోత్స హించేది ఉండదన్నారు. టీడీపీలో చేరిన వారిలో వీరంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు తురిమెర్ల రఘురామిరెడ్డి, ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులు తాటిపర్తి రాఘయ్య, పంచాయతీ వార్డు సభ్యుడు పలగాని శేషురెడ్డి, ముఖ్య నాయకులు తురిమెర్ల మస్తాన్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీ నరసా రెడ్డి, దగ్గవోలు రామచంద్రారెడ్డి, పలగాని పుష్పంత్‌రెడ్డి, పంట మనోహర్‌రెడ్డి, జెట్టి ఆదినారాయణరెడ్డి, సునీల్‌రెడ్డి, యద్దల పూడి సుబ్రహ్మణ్యం తదితరులను ఆయన పార్టీలోకి స్వాగతించారు. మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన ముఖ్య నాయకులు టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలకు ఫుల్ స్టాప్ పడిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయని చెప్పారు. వైసీపీ మండల ఉపాధ్యక్షుడు, వీరంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు తురిమెర్ల రఘురామిరెడ్డి, ఎంపీటీసీ తాటిపర్తి రాఘయ్య, వార్డు సభ్యులు పలగాని శేషురెడ్డితో పాటు 13మంది ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. వారు టీడీపీలోకి రావడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆయన ఆకాంక్షించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్యాయాలు, అక్రమాలకు ఫుల్‌స్టాప్ పడిందని, వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయన్నారు. సంతోషం వ్యక్తం చేశారు.

# యూరియా పక్కదారి పట్టకుండా స్క్వాడ్‌ల తనిఖీలు

జిల్లాలో యూరియా నిల్వలు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక స్క్వాడ్‌లు ఏర్పాటుచేసి వ్యవసాయాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. తనిఖీ బృందాలు ఎప్పటికప్పుడు గోడౌన్లు, స్టాక్ పాయింట్లలో యూరియా నిల్వలను పరిశీలించాలని, రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. నెల్లూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఇటీవల ఆమె అధికారులతో సమావేశమై యూరియా నిల్వలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మురళి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.లలిత శివజ్యోతి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా. డి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభతో రాణిస్తున్న ఎన్‌బికెఆర్ విద్యార్థులు

## ● ప్రాంగణ ఎంపికల్లో..62 మందికి ఉద్యోగాలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలతో రాణిస్తున్నారు. అనేకమంది ప్రాంగణ ఎంపికల్లో ఉత్తీర్ణత సాధించి మంచి ఉద్యోగావకాశాలను కూడా అందిపుచ్చుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన ఐఫిల్ టెక్ సొల్యూషన్ కంపెనీ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కంపెనీ సీఇఓ ఎన్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 62 మందికి టెక్లా, ఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. వారికి వార్షిక వేతనంగా రూ.2.5 లక్షలు ఇస్తారని ప్రాంగణ ఎంపికల అధికారి డా. కిషాందర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. కంపెనీ ప్రతినిధులు, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు పర్యవేక్షించారు.

### మరో 232 మందికి ఏవీకే టెక్ రాతపరీక్షలు :

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటున్న బీటెక్ చివరి ఏడాది చదువుతున్న సీఎస్ఇ, ఏఐ మరియు డీఎస్, ఐటీ విద్యార్థులకు ఇటీవల హైదరాబాద్‌కి చెందిన ఏవీటీక్ సొల్యూషన్స్ ప్రై.లి కంపెనీ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం 232 మంది విద్యార్థులు ఈ ఎంపికల కోసం రాతపరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ కంపెనీ ప్రతినిధి హేమబిందు మాట్లాడుతూ, తమ కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కి ప్రాతినిధ్యం ఇస్తున్నామని, పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలుంటాయని, ఫైనల్ రౌండ్‌లో కూడా విజయం సాధించినవారికి వారి ప్రతిభను బట్టి ఆకర్షణీయమైన వేతనం ఉంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, సీఎస్ఇ విభాగాధిపతి డా. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డులు



కూటమి ప్రభుత్వ పాలన రాజ్యాంగబద్ధంగా సాగుతోందని, ఎంతో పారదర్శకంగా స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కొనియాడారు. గూడూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆగస్టు 25వ తేదీన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డులు, పాస్‌పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటోలు వేసుకున్నారని, నేడు ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తోందని, వాటి మీద ఎక్కడా ఫోటోలు లేవని అన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి రేషన్ కార్డులను అందజేస్తారని, రానివారు ఐదు రోజుల తర్వాత రేషన్ షాపుల్లో సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ ప్రసాద్, చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాసాచారి, నాయకులు కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరం



విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా ఇటీవల గూడూరు నరసింగరావుపేటలో ఎన్టీఆర్ ట్రస్టు, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పాల్గొనగా బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం గూడూరు ఇన్‌ఛార్జి బి.కె.వాణి, కె.రఘురామిరెడ్డి, బి.కె.గురునాథం, బి.కె. రామచంద్రయ్య, శ్రీనివాసులురెడ్డి, శైలజ, రత్నమ్మ, లత, కౌశల్య, భద్ర, రోహిత్, నాగరాజు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో 'స్వచ్ఛఆంధ్ర'




గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీ 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛఆంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ.. పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు

గూడూరు మండలం, చెన్నూరు గ్రామం, హరిజనవాడ మరియు ఎస్టీకాలనీలోని ప్రజలకు చట్టపరమైన హక్కులు, బాల్య వివాహాలు, సామాజిక సమస్యలు మరియు నివారణ చర్యలపై ఇటీవల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బి.వి.సులోచనరాణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.రాజేష్, సివిల్ జడ్జి పార్వతయ్య, తాజుద్దీన్, కోటేశ్వరరావు, రూరల్ ఎస్.ఐ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సునీతా సేవాసంస్థ.. సామూహిక సీమంతాలు



గూడూరు, రాజావీధిలోని సునీతా సేవాసంస్థ కార్యాలయంలో ఆ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల అతిథుల చేతులమీదుగా గర్భవతులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు పావని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగు గంగ ప్రాజెక్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. సేవను వ్యాపారంగా కాకుండా ఎక్కడా పైసా కూడా ఇతరులనుండి ఆశించకుండా తమ సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సునీతా సేవాసంస్థ నిర్వాహకులను కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, పట్టణ సీడీపీవో మెహబూబీ, పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉష, అనిత తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు భోజనం పంపిణీ

గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆగస్టు 24వ తేదీ పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బి.శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో పేదలకు వీలైనంత సహాయసహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చారిటీస్ ప్రతినిధులు బి.మహేశ్వరి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## బాబోయ్..
# గొలుసు దొంగలు!

**మహిళలూ జాగ్రత్త**

నెల్లూరు నగరంలో ఇటీవల మళ్ళీ మహిళల మెడల్లో బంగారు నగలను లాక్కొనిపోయే గొలుసు దొంగలు విజృంభిస్తున్నారు. ఈనెల 26న ఒక్కరోజునే రెండు ఘటనల్లో దొంగలు తమ హస్త లాఘవం చూపారు. నెల్లూరు శివారుల్లోని పడారుపల్లి కావేరినగర్‌లో ఉన్న బుజ్జమ్మ, ఇంటి ముందు ముగ్గు వేస్తుండగ మోటార్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకడు బైక్‌పై ఉండగా, మరొకడు ఆమె మెడలోని బంగారు దండను తెంపుకుని పరుగెత్తి బైక్‌పై కూర్చున్నాడు. ఇద్దరూ వెంటనే బైక్‌పై పరారయ్యారు. ఆమె తేరుకునే లోపలే జరగకూడనిదంతా జరిగిపోయింది. రెండున్నర సవర్ల బంగారు సరుడును లాక్కుని పోయారు. దీంతో ఆమె లబోదిబోమంటూ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

**బాలాజీనగర్‌లోనూ అదే తీరు :**

అదేవిధంగా బాలాజీనగర్‌లోనూ దుండగులు అదే తీరుతో మరో మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్ళారు. ఆమె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి, ఆమె మెడలో ఉన్న 18 గ్రాముల బంగారు గొలుసుని లాక్కుని పోయారు. ఆమె తేరుకుని పెద్దగా కేకలు వేసినా, అప్పటికే వారు పరారైపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గొలుసు దొంగల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఏదేమైనా, మహిళలు ఇలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. ఈజీ మనీ కోసం దొంగలే కాక, కొందరు చెడుతిరుగుళ్ళు తిరిగే యువకులు కూడా ఇలాంటి పనులకు పాల్పడుతున్నారు. మహిళలూ!.. తస్మాత్ జాగ్రత్త!


# సాయిదర్బార్‌లో.. పెంచలస్వామి కల్యాణం





నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరానికి అనుబంధంగా ఉన్న శ్రీ సాయిమాత నిత్య అన్నప్రసాదాలయం 4వ వార్షికోత్సవం ఈనెల 26న ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మందిరంలో కొలువై ఉన్న శ్రీ సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ ఆదిలక్ష్మీదేవి- చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలతో, అన్నమయ్య కీర్తనలతో, భక్తుల పండరి భజనలతో, కోలాటాలతో, గోవిందనామాలతో మందిర ప్రాంగణం మార్మోగింది. వేద పండితులు వేదగిరి ఫణిశర్మ, తారకేష్‌శర్మ సారథ్యంలో స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకి అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణోత్సవంలోని ముత్యాలు, అక్షింతలు భక్తులకు పంపిణీ చేశారు. సాయిదర్బార్ మందిరం చైర్మన్ మధు సాయి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. సాయిదర్బార్ గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు.

# అలరించిన..నళిని భరతనాట్యం



నెల్లూరు నగరంలో పుట్టి, పాతికేళ్ళ క్రితమే అమెరికాలో స్థిరపడిన ప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి నళిని ముకుందల గుంటూరి ఈనెల 23వతేదీ నెల్లూరు టౌన్‌హాలులో అద్భుతంగా భరతనాట్యం ప్రదర్శించి అందరినీ అలరించారు. సుప్రసిద్ధ నాట్యగురువు శరణ్యాగణేశన్ శిష్యరికంలో భారతీయ శాస్త్రీయ నృత్యాన్ని ఆమె సాధన చేసి, వివిధ ప్రాంతాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి అంతటా కీర్తిని గడించారు. తమ జన్మస్థలమైన నెల్లూరు పట్టణంలో కూడా తన భరతనాట్య కళను ప్రదర్శించాలనే కోరికతో ఆమె 23న ఇక్కడ ఆరంగేట్రం చేశారు. నళిని నాట్యప్రదర్శన ఆద్యంతం అమోఘంగా సాగి అందరి కరతాళధ్వనులందుకుంది. ఈ సందర్భంగా ఆమె తన గురువైన శరణ్యాగణేశన్ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వారిని సత్కరించారు. నళిని భరత నాట్యానికి.. కుమారి మల్లాది అనూష గాత్ర సహకారాన్ని అందించగా, మృదంగ కళాకారులు ఆర్ఎం ఈశ్వర్‌పాయ్, వయోలిన్ విద్వాంసులు మద్దెల లోకేష్‌బాబు వాద్య సహకారం అందించారు. నళిని బంధుమిత్రులు, ఆత్మీయుల సహకారంతో ఏర్పాటైన ఈ భరతనాట్య కళాప్రదర్శన కార్యక్రమంలో గణేశన్, లక్ష్మీగణేశన్, ముకుందల సరళ, చదలవాడ రేవతి అరుణకుమారి, ఆకుల గోపి, నాగిని, మారేపల్లి నందిత, బండి వైజయంతి, పి.కీర్తిని, అవధాని కోట రాజశేఖర్, గిరిజాకుమారి దంపతులు, డాక్టర్ మర్రి వెంకటరావు-రాజేశ్వరి దంపతులు పాల్గొని నళిని నాట్య కళాప్రతిభను కొనియాడుతూ, ఆమెను ఘనంగా సన్మానించారు.

# సూపర్ సిక్స్..సూపర్ హిట్

## • కోవూరులో వేడుకగా స్త్రీ శక్తి విజయోత్సవ సభ





'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' అంటూ పెద్దపెట్టున మహిళలు ఆనందంతో కేరింతలు కొడుతుండగా, ఉచిత బస్సుల పట్ల ఎక్కడ చూసినా ఆనందోత్సాహాలు పెల్లుబుకుతుండగా కోవూరులో జరిగిన స్త్రీశక్తి సభ..జాతరను తలపించింది. కోవూరు తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఇటీవల జరిగిన విజయోత్సవ సభకు వేలాదిగా మహిళలు తరలివచ్చారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా శక్తికి నిదర్శనమే ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడమని ఆయన అంటూ, చంద్రబాబునాయుడు అవకాశం ఇవ్వడం వల్లే ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా, తాను ఎంపీగా ఇక్కడ ఉన్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**మహిళల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే చంద్రబాబు సారథ్యంలో, రాష్ట్రంలోని మహిళలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, దీని ద్వారా వారికి రూ. 3.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని, మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను కూడా తీసుకువచ్చారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఆయన అంటూ, జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంపీగా తనవంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఈ కింద మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని, పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు పాలన నుంచి నేటి వరకు తమ పార్టీ మహిళాభివృద్ధికి కృషి చేస్తూనే ఉందని అన్నారు. యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ఆలోచనల నుంచి రూపొందించిన సంక్షేమ కార్యక్రమమే స్త్రీ శక్తి పథకమన్నారు. ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన స్త్రీ శక్తి పథకం కూడా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కానుకగా ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన పలువురు మహిళలను ఎంపీ వేమిరెడ్డి, ప్రశాంతమ్మ దంపతులు ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకురాలు, మాజీ ఎంపీపీ యాకసిరి వెంకటరమణమ్మ, పారిశుధ్య కార్మికురాలు బండి విజయలక్ష్మి, సంఘ సేవకురాలు కె.సుభద్రమ్మ, సంఘమిత్ర పొదుపు సంఘ అధ్యక్షురాలు సిహెచ్ రమ్య తదితరులను ఘనంగా సన్మానించారు.

## 'విపిఆర్ వికాస్'తో..
# యువతకు ప్రోత్సాహం



యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ, విపిఆర్ వికాస్ కార్యక్రమం కింద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు వారికి క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇందుకూరుపేట మండల యువతకు క్రీడా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు విపిఆర్ ఫౌండేషన్ ఎంతో చేయూతనిస్తుందని, దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలోకి..
# జిల్లా నుంచి ఇద్దరు

**ఉపాధ్యక్షునిగా సురేంద్రరెడ్డి, సంయుక్త కోశాధికారిగా కందుకూరి**





భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోకి జిల్లాకి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు ఎంపికయ్యారు. అందులో నెల్లూరుకు చెందిన పి.సురేంద్రరెడ్డి, కావలికి చెందిన కందుకూరి సత్యనారాయణ ఉన్నారు. వీరిద్దరికీ ఆమేరకు పదవీ బాధ్యతలు కేటాయిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. బీజేపీలోనే కాక, జిల్లా రాజకీయాల్లో సురేంద్రరెడ్డి అందరికీ సుపరిచితులే. క్రమశిక్షణతో ఆయన సుదీర్ఘకాలం నుంచి పార్టీకి సేవలందిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే బీజేపీలో ఉంటూ ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. జిల్లా బీజేపీకి అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కూడా పార్టీకి పనిచేశారు. తాజాగా ఆయనకు మరోసారి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి లభించడంతో ఆ పార్టీలో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి.

అదేవిధంగా, కందుకూరి సత్యనారాయణ కూడా గతంలో బీజేపీ జిల్లాశాఖ ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర సహాయ కోశాధికారిగా నిబద్ధతతో పనిచేశారు.



# జగన్‌తో పర్వతరెడ్డి భేటీ

మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నెల్లూరుజిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్..ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 25న తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులను జగన్‌కి వివరించారు. జిల్లాలో పార్టీని పటిష్ఠం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి పర్వతరెడ్డికి సూచించారు.

# అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

## బీజేపీ నేత మిడతల రమేష్ వినతి



నెల్లూరు నగర పరిధిలోని కొండ్లపూడి హౌసింగ్ లేఔట్‌లో లబ్ధిదారుల నివసించేందుకు ఒక్క ఇల్లు కూడా నివాసయోగ్యంగా నిర్మించలేదని, అధికారులు-కాంట్రాక్టర్‌లు లాభపడ్డారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ చెప్పారు. ఇటీవల ఆయన ఆ లేఅవుట్‌ని సందర్శించారు. అక్కడ 2938 ఇళ్ళు నిర్మిస్తే, ఒక్కటి కూడా బాగా లేదన్నారు. పేదలు నివసించేందుకు వీలుగా పూర్తిస్థాయి నిర్మాణాలు చేయలేదని, అంతా అరాకొరగా చేసి వదిలేసి బిల్లులు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయని పనులకు కూడా బిల్లులు చేసి ప్రజల సొమ్ము తినేశారని, వీటన్నిటినీ పరిశీలించి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆమేరకు తాము ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాయనున్నట్లు కూడా చెప్పారు. ఇక్కడ అవినీతి జరిగిందని అధికారులకు తెలిసినా, అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదని, ఈ లేఅవుట్ నిర్మాణాలకి సంబంధించి పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ లేదా సిట్ అధికారులతో దర్యాప్తు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆక్వా జోన్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం త్వరలోనే జిల్లాలో ఆక్వా జోన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు కె.శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఎల్‌సి సమా వేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఎస్ఏడీఏ కో-ఛైర్మెన్ ఆనం వెంకటరమణారెడ్డి, చెన్నై నుంచి వచ్చిన సీఐబీఏ అధికారి డా.అశోక్ కుమార్, సీఏఏ అధికారి డా.శంకర్‌రావు, సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త జయశ్రీ లోఖ, తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ తరఫున ప్రొఫెసర్ అనుపమ, ఎంపెడా ప్రతినిధి స్వదీప్, మత్స్యశాఖ జేడీ, ఆక్వారైతులు సునీల్‌కుమార్‌రెడ్డి, నరసింహం తదితరులు పాల్గొన్నారన్నారు. సారవంతమైన వ్యవసాయ భూములను ఆక్వా గుంటలుగా అనధికారికంగా మార్చడాన్ని నియంత్రించేందుకు, అదేవిధంగా నిస్సారమైన భూముల్లో నిబంధనలను అనుసరించి ఆక్వా అనుమతులు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీఓ నం.16 మేరకు, ప్రస్తుతం ఉన్న మంచినీటి గుంటలు, ఉప్పునీటి గుంటలను, ఆక్వా సాగుకు అనువైన భూములను రెవెన్యూ గ్రామాల వారీగా సర్వే చేయిస్తున్నామన్నారు. జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 96 రెవెన్యూ గ్రామాల్లో సాగులో ఉన్న 4179.18 ఎకరాల ఉప్పునీటి గుంటలకు సంబంధించి 3272 మంది రైతులకు, 2785.62 ఎకరాల మంచినీటి గుంటలకు చెందిన 2293 మంది రైతులను ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. మత్స్యశాఖ అధికారులు ఆక్వాజోన్ల ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలకు ప్రజాదరణ

## ఎమ్మెల్యే కాకర్ల హర్షం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు బాగా ప్రజాదరణ పొందుతున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 25న ఆయన మండలకేంద్రమైన దుత్తలూరులో క్యూఆర్ కోడ్‌తో అనుసంధానించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీ సజావుగా, సక్రమంగా సాగేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్‌కార్డులు రూపొందించిందని, లబ్దిదారులకు ఇవెంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎంతో పట్టుదలతో పేదప్రజలకు ఉపయోగపడే విధంగా రేషన్ కార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా నూతనంగా సాంకేతికత జోడించి స్మార్ట్ రేషన్ కార్డులు తయారుచేయించి లబ్ధిదారులకు అందిస్తుండడం సంతోషకరమన్నారు. గతంలో రేషన్ కార్డుల్లో అనేక తప్పులు ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని ఆయన గుర్తుచేస్తూ, ఇకనుంచీ అలాంటి ఇబ్బందులు ఏమీ ఉండవన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జనసేన నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### కాకర్లకి ధన్యవాదాలు

సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లి నూతన సొసైటీ ఛైర్మెన్‌గా ఎన్నికైన సోమనబోయిన రాజశేఖర్, డైరెక్టర్లు గొల్లపల్లి భాస్కర్, రఘురాములు ఈనెల 25న వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలోఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ని కలిసి, శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు ఇచ్చిన బాధ్యతలను వమ్ముచేయకుండా రైతులకు అండగా ఉంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరుగుళం హైస్కూల్‌ను సందర్శించిన .. 'డానియేలి' కంపెనీ ఛైర్‌పర్సన్

శ్రీసిటీలోని మెట్రో రైళ్ల తయారీ పరిశ్రమ డానియేలి కంపెనీ ఛైర్‌పర్సన్ మారేస్చి డానియేలి అన్నా ఈనెల 26న శ్రీసిటీ సమీపంలోని ఇరుగుళం జెడ్‌పి హైస్కూల్‌ను సందర్శించారు. శ్రీసిటీ పర్యటనలో భాగంగా ఆమె ఇక్కడకు వచ్చారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో స్కూల్లో తమ కంపెనీ చేపట్టిన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) పనులను పరిశీలించారు. తాము కల్పించిన వివిధ సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 2015, 2020 మధ్య డానియేలి కంపెనీ సిఎస్ఆర్ కార్యక్రమాలలో ఇరుగుళం జెడ్‌పి హైస్కూల్‌కు సుమారు 60లక్షలు వెచ్చించింది. ఇందులో తరగతి గదుల నిర్మాణం, పాఠశాల భవనాల మరమ్మతులు, ఫర్నిచర్ ఏర్పాటు, సబ్‌మెర్సిబుల్ మోటారుతో సహా బోర్‌వెల్ ఏర్పాటు, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు మరియు ఇరుగుళం ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల మరమ్మతులు ఉన్నాయి. పర్యటనకు విచ్చేసిన మారేస్చి డానియేలి అన్నాకు శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఇరుగుళం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ సాదర స్వాగతం పలికారు. ఆమెతో పాటు డానియేలి ఇండియా ఉన్నతాధికారులు అంబ్రోసినో డొమెనికో, సీఓఓ శ్రీనివాస్‌రావు, సీఎఫ్ఓ రాజేష్ హిసారియాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్‌కి 'వినాయక వ్రతకల్పం' పుస్తకాలు




వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెజవాడ సునీల్‌రెడ్డి సౌజన్యంతో 'వినాయక వ్రతకల్పం' పుస్తకాలను 350 మంది వాకర్స్‌కి పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ, వాకర్స్ మిత్రులందరూ వినాయకుని, భక్తిశ్రద్ధలతో పూజించి స్వామివారి కృపా, కటాక్షాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు రాఘవేంద్ర షెట్టి, స్వర్ణ రమేష్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, డీవీ సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, జయదేవ్, సుబ్బారామిరెడ్డి, ఆరి ప్రసాద్, చంద్రమౌళి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## కలువాయిలో ఫ్లోరోసిస్‌పై అవగాహన

కలువాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 26న సూపర్‌వైజర్లకు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ కలసిన నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇంటింటికీ వెళ్ళి మంచినీటిని పరిశీలించి తగు సూచనలివ్వాలని జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారిణి డాక్టర్ దివ్య తదితరులు పాల్గొని ఫ్లోరైడ్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

## కొడవలూరులో 'పొలం పిలుస్తోంది'

మండల కేంద్రమైన కొడవలూరులో ఈనెల 26న వ్యవసాయ అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగు పట్ల రైతులకు మెళకువలు తెలిపారు. సీసీఆర్ కార్డులను పొందడం ద్వారా కౌలురైతులకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పడుగుపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవూరు మండలం పడుగుపాడు వద్ద ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో నెల్లూరు మూలాపేటకు చెందిన విష్ణు అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నార్తురాజుపాళెం వద్ద మోటార్‌బైక్‌పై వెళ్తుండగా పడుగుపాడు వద్దకు రాగానే బైక్‌పై నుంచి జారిపడడంతో గాయాలు తగిలాయని, ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని చెప్పారు.

## గంగిరెడ్డిపల్లిలో గృహనిర్మాణాల పరిశీలన

ఉదయగిరి మండలపరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఇటీవల జల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వేణుగోపాల్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, త్వరిత గతిన వాటిని పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## ఆత్మకూరులో వయోజన విద్య శిక్షణ సమావేశం

ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 26న వయోజన విద్య మండలస్థాయి శిక్షణా సమావేశం జరిగింది. నూటికి నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కృషిచేయాలని వయోజనవిద్య సూపర్‌వైజర్ ఎల్.రామకుమార్ వలంటీర్లకు తెలిపారు. అక్షరాంధ్ర శిక్షణా కార్యక్రమం రిసోర్స్ పర్సన్ రవీంద్రకుమార్, ఎంపీడీఓ రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో మదర్ థెరిస్సా జయంతి

కావలి పట్టణంలోని ప్రజావైద్యశాలలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 26న మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మానవత్వానికి, సేవాభావానికి ప్రతీకగా నిలచి ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచిన మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయమన్నారు.

## సంగం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సంగం మండలంలోని పలు ఎరువులు దుకాణాల్లో అధికారులు ఈనెల 26న ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని దుకాణదారులకు స్పష్టం చేశారు. యూరియాను డీలర్లు పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాపూరులో సర్వేలపై సమీక్ష

రాపూరు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సర్వేలను శాఖలవారీగా ఈనెల 27న డివిజినల్ అభివృద్ధి అధికారిణి వసుమతి సమీక్షించారు. పనుల పురోగతికి సంబంధించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భవాని, హౌసింగ్ ఏఇ రామకృష్ణ, ఉపాధిహామీ ఏపీఓ చంద్రయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా మార్మోగిన.. 'ఉదయగిరి'

**అధునాతన యుద్ధనౌకను జాతికి అంకితం చేసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్**



***శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని 'ఉదయగిరి' పేరు ఒక్కసారిగా జాతీయస్థాయిలో మార్మోగింది. జిల్లాలోని ఉదయగిరి చారిత్రక వైభవానికి జాతీయస్థాయిలో ఘనమైన గుర్తింపు లభించింది. కేంద్రప్రభుత్వం ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో అత్యద్భుతంగా రూపొందించిన యుద్ధనౌకకి 'ఉదయగిరి' పేరు పెట్టడం గొప్ప విశేషం.***

ఆత్మ నిర్భర్ నావికాదళం ఐఎన్ఎస్ ఉదయగిరితో పాటు, మరో నౌక ఐఎన్ఎస్ 'హిమగిరి'ని కూడా ఈనెల 26న విశాఖ పట్నంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ఆయన చేతులమీదుగా ఆ యుద్ధనౌకలు తూర్పు నౌకాదళంలో చేరడం భారత నౌకాదళ చరిత్రలో నూతనాధ్యాయానికి నాందిగా భావించవచ్చు. ఉదయగిరి (ఎఫ్–35) నౌకను ముంబైలో, హిమగిరి(ఎఫ్–34)ని కలకత్తాలో రూపొందించారు. రెండు వేర్వేరు షిప్‌యార్డుల్లో ఇవి తయారైనా, ఒకేసారి ఒకేచోట నౌకాదళంలో ప్రవేశించడం చరిత్రాత్మకం. ఉదయగిరి యుద్ధనౌక గంటకు 28 నాటికల్ మైళ్ళ వేగంతో సముద్రంలో ప్రయాణిస్తుంది. 149 మీటర్ల పొడవుతో, 40మిసైళ్ల సామర్థ్యంతో ఇది అమోఘమైన శక్తియుక్తులతో రాణిస్తుంది. భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచే ఈ యుద్ధనౌకలు అత్యంత అధునాతనమైన రాడార్లు, ఆయుధాలతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాయని, శత్రువుల కవ్వింపు చర్యల్ని సమర్ధవంతంగా తిప్పికొట్టగలిగే అసాధారణ ప్రజ్ఞాపాటవాలు కలిగిన ఆయుధ సంపత్తి వాటి సొంతమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ సందర్భంగా వివరించారు. ఈ యుద్ధనౌకలు దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడమే కాక, సముద్ర జలాల ప్రయోజనాలను కాపాడతాయని, సముద్ర సరిహద్దులను పరిరక్షిస్తాయని, విపత్తుల వేళ మానవతా సాయం అందిస్తాయని కూడా ఆయన తెలిపారు. జాతీయ ప్రయోజనాలు కాపాడుకునేందుకు, భారతదేశ స్వావలంబనను పరిరక్షించుకోవడానికి, ప్రధాని నరేంద్రమోడీ కన్న కలలను సాకారం చేస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా ఇదొక పెద్ద ముందడుగు అని ఆయన అన్నారు. మనదేశానికి చెందిన ఎంతో ప్రతిష్టాత్మకమైన అలాంటి యుద్ధ నౌకకు 'ఉదయగిరి' పేరు పెట్టడం పట్ల ఉదయగిరి ప్రజల్లోనే కాక, జిల్లావాసుల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

## అరుదైన గుర్తింపు - ఎమ్మెల్యే కాకర్ల హర్షం




దేశ రక్షణ నౌకకు 'ఉదయగిరి' పేరు నామకరణం చేయడం ఉదయగిరికే కాదు..జిల్లాకు.. దేశానికే గర్వకారణమని, జాతీయస్థాయిలో ఉదయగిరి నియోజకవర్గానికి గుర్తింపు ఇచ్చినట్లయిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉదయగిరి' యుద్ధనౌకను జాతికి అంకితం చేసిన క్షణం ఎంతో చరిత్రాత్మకమైందన్నారు. ఈ రక్షణ నౌకను సృష్టించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వం మరియు "ఆత్మనిర్భర్ భారత్' దార్శనికత కీలకపాత్ర పోషించాయన్నారు. ఈ రక్షణ నౌక ద్వారా ఉదయగిరి నియోజకవర్గం పేరు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మన రాష్ట్రానికి గొప్ప గౌరవం అని ఆయన అంటూ, అందుకు సహకరించిన వారందరికీ ఉదయగిరి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# రికార్డు స్థాయిలో..బాధితులకి సాయం

- ఒకేరోజు వందమందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 100 మంది బాధిత కుటుంబాల వారికి సుమారు రూ.83.34 లక్షల విలువైన చెక్కులను ఈనెల 28న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేసి లబ్దిదారుల మన్ననలందుకున్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారంటూ, ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్రవ్యాప్తంగా బాధితులకు కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నారని ఆయన కొనియాడారు. 2024 ఆగస్టు నుంచి ఇప్పటివరకు ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో 381 కుటుంబాలకు 4.20 కోట్ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందజేయడం జరిగిందని ఆయన వివరించారు.



# వీధివీధినా వినాయకునికి వేడుకలు



వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 27న నెల్లూరు నగరంలో పెద్దఎత్తున వినాయక మండపాల్లో పూజలు సేవలు జరిగాయి. వినాయక భజనలు, పాటలతో పురవీధులు మార్మోగాయి. వినాయక మందిరాలకు భక్తజనం తరలివచ్చి పూజలు చేసుకుని, గణేశుని దీవెనలందుకున్నారు. వీధివీధినా వెలసిన మండపాల్లో పెద్దపెద్ద వినాయక విగ్రహాలను నిర్వాహకులు అందంగా అలంకరించి ప్రజల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణలు, పూల అలంకరణలతో మండపాలు కళకళలాడాయి. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని లంబోదర గణేష్ మండపంలో విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రముఖులు, ప్రజలు ఇక్కడి గణనాథుని భక్తితో దర్శించుకున్నారు. గణేశుని దర్శనం కోసం వచ్చిన కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మండపం నిర్వాహకులు నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికి, వినాయక విగ్రహం వద్ద పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను దర్శించుకుని నిర్వాహకులను అభినందించారు. సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ సెంటర్లో నిర్వహించే వినాయక మండపాన్ని సందర్శించేందుకు అక్కడికి వెళ్ళిన ప్రశాంతమ్మకి ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బిజెపి రాష్ట నాయకులు సురేంద్రరెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు వంశీరెడ్డి, స్థానిక నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. చిన్న బజార్ సెంటర్లో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలలో పాల్గొన్న అనంతరం నెల్లూరు నగరం టౌన్‌హాల్ వద్ద ఉన్న వినాయకస్వామి వారి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com